# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 40 సంచిక 6

పేజీలు 44

ఫిబ్రవరి 2021

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో ............................ ....... పేజీ**


దాశరథీ శతకము ........................................4

శ్రీబాబూజీ ఉవాచ........................................ 5

అమ్మమాట........................................ 7

హైదరాబాద్ శాఖలో కార్యక్రమాలు..........9

అమ్మ ఆలింగన భాగ్యం..............................10

అగస్త్య హృదయం ........................ ..............11

అమ్మతో మాట ........................................13

మానవ సేవయే మాధవ సేవ.......................15

రామాయణంలో స్త్రీ పాత్రలు......................17

బాబూజీతో అనుభవాలు ............................19

సుఖం ............................ ....................... ...................21

భీష్మాచార్య ................................. ..............................25

మధురం మధురం మధురం ................28

శ్రీ కృష్ణజన్మాష్టమి ................ ......... ...... ..................30

కైవల్యోపనిషత్ ... ..........................................32

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు..........................33

గోమాత ............................................ ....................34

షడ్గుణాలు ........................ ..................................35

ధర్మో రక్షతి రక్షితః ............................................36

శ్రీ నృసింహ యోగీంద్రులు ............................37

సమర్థ సద్గురునాథుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు ....... ............................ ...................41

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

7) **మసకొని రేగుబండ్లుకును మౌక్తికముల్ వెలవోసినట్లు దు**
**ర్వ్యసనముజెంది కావ్యము దురాత్ములకిచ్చితి మోసమయ్యె నా**
**రసనకుఁబూతవృత్తి సుకరంబుగ జేరుకునట్లు వాక్సుధా**
**రసములుచిల్క బద్యముఖ రంగమునందునటింప వయ్య సం**
**తసమును జెంది భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ!**

భావం - రేగుపండ్లను ముత్తెములు పోసి కొనినట్లు దురాశతో మోసపోయి నా కావ్యములను దుర్మార్గుల కిచ్చితిని; నా నాల్కకు పవిత్రత సులభముగ గల్గనట్లును, పలుకుదేనియలు చిలుకునట్లు నా పద్యము ముఖమను నాట్యరంగమునందు సంతోషముతో నీవు నటింపుము దాశరథీ కరుణాపయోనిధీ!




*భగవత్తత్వం అర్థం కావాలంటే ఎవరి సాంగత్యం కావాలి?
*శ్రీరామచంద్రుని ఆలింగన భాగ్యాన్ని పొందిన ఆ ఇద్దరెవరు?
*అవధూత స్వామి ఎవరిని యమదూతలనుండి కాపాడారు?
*శ్రీరామునికి విష్ణుచాపమును అక్షయ తూణీరాలను ఇచ్చినదెవరు?
*సముద్రాన్నే వడ్డాణంగా పెట్టుకున్నదెవరు?
*గ్రౌండ్ ఫ్లోర్ నుండి థర్డ్ ఫ్లోర్‌కి తీసుకువెళ్ళే లిఫ్ట్ పేరేమిటి?
*అర్కసోమయాజి పొలిమేర దాటగానే ఊరంతా ఎందుకు బూడిద అయింది?
*హరిగిరివిశ్వప్రకాశం అంటే ఎవరు?
*వేటితో వున్నవారికి పరమాత్మ విలువ తెలియదు?
*ప్రభాసుడి మరుజన్మ ఏది?

***సమాధానాలు లోపలి పేజీలలో............................***

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

4-10-1980

హైద్రాబాద్ మూర్తీజీ ఇంట్లో మేము శ్రీ బాబూజీతో వెళ్ళి బస చేశాము. శ్రీ బాబూజీకి ఫోన్‌కాల్ వచ్చింది. ఫోన్లో మాట్లాడిన తర్వాత మమ్మల్ని ఉద్దేశించి బోధ చేస్తూ "ఒక భక్తుడు సమస్యలతో బాధపడుతున్నాడు. దశ ఉన్నంతవరకు నా అంతటివాడు లేడనుకుంటాడు. ఆ దశ తిరిగిన తర్వాత ఏ పనిచేసినా అపజయమే. కాలేజి ప్రిన్సిపాల్, కాలేజిలో జరిగే పనులన్నీ తన వలననే జరుగుతున్నాయి అనుకుంటాడు. అసలు పనులు చేసేవారు ఆ కాలేజిలో ఇతర సిబ్బంది మాత్రమే.



చూడండి. ఎస్.పి. ఉంటాడు ఎస్. ఐ. ఉంటాడు. అసలు కష్టపడేది పోలీస్ కానిస్టేబుల్, ఎస్. ఐ.లు మాత్రమే. కాని పని బాగా జరిగిన తర్వాత ఆ ఘనత ఎస్.పికి దక్కుతుంది.

అలాగే మన ఇంద్రియముల ద్వారా భగవానుడు అనేక క్లిష్టమైన పనులు చేయిస్తాడు. వాటికి కావలసిన శక్తినిస్తాడు. అయితే అదంతా మన ప్రజ్ఞ అని మనం భావిస్తాం. పరమాత్మ విలువని గుర్తించం. ఇప్పుడే నాకు ఫోన్ వచ్చింది. పాపం మన భక్తుడు చిక్కుల్లో పడ్డాడు. మనము ఏమీ చేయకపోతే అతను నాశనం అవటమే కాక అనేకమందిని నాశనం చేస్తాడు. అటువంటి దుర్భరస్థితి నుంచి రక్షించాలా వద్దా?" అని మమ్మల్ని ప్రశ్నించారు.

మేమంతా "తప్పక రక్షించాలి" అని అన్నాము.

"అది సరే అనుకోండి. ఆ వ్యక్తి పరమాత్ముని విలువ గుర్తించాలి కదా! సంశయాలతో ఉన్నవాడికి పరమాత్ముని విలువ ఎలా తెలుస్తుంది? పాజిటివ్, నెగిటివ్ తీగెలను కలిపితేనే కదా శక్తి ఉద్భవించేది, వెలుగును

ప్రసాదించేది. అది లేకపోతే అంతా చీకటే కదా! దశ బాగా ఉన్నప్పుడు ఏమీ గోచరించదు. దశ ఏ మాత్రం వక్రించినా, అసలు విషయం బోధ పడుతుంది.

అర్జునుడు కురుక్షేత్ర సంగ్రామంలో శ్రీకృష్ణ పరమాత్ముని తన బావగా, స్నేహితునిగా, రథసారథిగా ఊహించాడు. కొన్ని సమయాల్లో కర్ణునితో యుద్ధం చేస్తుండగా తన పరాక్రమానికి తానే గర్వపడుతూ కర్ణుని పరాక్రమాన్ని తెలుసుకోలేకపోతాడు.

కర్ణుడు శాపగ్రస్తుడు కావటంవలన, శ్రీకృష్ణ పరమాత్మ రథసారథి కావటం వలన కురుక్షేత్ర సంగ్రామంలో కర్ణుడి అస్త్రాలకు అర్జునుడు నిలిచాడుగాని, లేని పక్షంలో ఒక్క కర్ణుడే పాండవులందరిని సంహరించేవాడు.

శ్రీ కృష్ణుడు ఒక్కసారి తన కాలివేలుని రథానికి బయటపెట్టేసరికి అర్జునుడి రథం కర్ణుడి అస్త్రాల ధాటికి రెపరెపలాడింది. శ్రీకృష్ణుని అవతార సమాప్తి అయిన తర్వాత అర్జునుడు కురుక్షేత్ర సంగ్రామంలో తన పరాక్రమానికి కారకులెవరో గ్రహిస్తాడు.

అర్జునుని కొందరు కిరాతులు కట్టివేస్తారు. కనీసం గాండీవాన్ని ఎత్తలేకపోతాడు. అప్పుడు దుఃఖిస్తాడు. హే! కృష్ణా! నిన్ను ఎప్పుడూ స్నేహితుడిగానో, రథసారథిగానో మాత్రమే భావించానుగాని పరమాత్ముడిగా భావించలేదు. ఆ శక్తి లేకపోవటం వలననే ఇప్పుడు మాకు ఈ దుస్థితి కల్గింది అని దుఃఖిస్తాడు.

ధర్మరాజు అర్జునుని ఓదారుస్తూ అర్జునా! కలియుగం ఆసన్నమైంది. కలియుగంలో మనకు స్థానం లేదు. మనం నిష్క్రమిద్దాం. ఇట్టి దుర్భరస్థితి నుంచి మనను శ్రీకృష్ణ పరమాత్మ తప్పక రక్షిస్తారు" అని అంటాడు.

"గురుమూర్తిని ఆశ్రయిస్తే ఇంకేముంది" అన్నారు శ్రీ బాబూజీ.

# అమ్మమాట

- రమణ ప్రసాద్

## *వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్*

కార్యసిద్ధి పొందాలంటే శ్రీ ఆంజనేయ స్వామిని తలవాలి. భగవత్తత్త్వం అర్థం కావాలంటే భక్తుల సాంగత్యంలో ఉండాలి. హనుమాన్ చాలీసా పారాయణ ఇహానికి పరానికి ఉపయుక్తమైనది.

రోగాలు తొలగాలంటే : **నాసైరోగ్ హరై సబ్‌పీడా ।జపత్ నిరంతర హనుమత్ వీరా**

విద్యా బుద్ధులు కావాలంటే : **విద్యావాన్ గుణీ అతి చాతుర । రామకాజ కరివేకో ఆతుర ॥** పిరికితనం పోవాలంటే : **మహావీర విక్రమ బజరంగీ । కుమతి నివార సుమతి కే సంగీ।** భక్తి పెంపొందాలంటే **రామదూత అతులిత బలధామా । అంజని పుత్ర పవన సుత నామా।** - అనే దోహాలు పారాయణ చేయాలి.



భగవదనుగ్రహం పొందాలంటే భక్తి విశ్వాసాలను కలిగి ఉండాలి. సాంబశివునికి రూపనామాలు ఉన్నాయా? చిన్నప్పుడు పువ్వులు, పత్రి తెచ్చుకుని, మట్టితో శివలింగాన్ని చేసి, అష్టోత్తరంతో పూజ చేసేదాన్ని. మరమరాలు నైవేద్యం పెట్టేదాన్ని. మరి ఆయన అనుగ్రహాన్ని పొందలేదా? మన ఇంట్లో ఉన్న పెద్దలను గౌరవించాలి, పూజించాలి. ఎదుట ఉన్న ప్రత్యక్ష పరమేశ్వరులను తృప్తి పరచకపోతే ఎక్కడో ఉన్న గౌరీ శంకరుడు ప్రత్యక్షమవుతాడా?

మనం నవ విధ భక్తుల గురించి మాట్లాడుకుంటున్నాం. నిన్న అర్చన గురించి చెప్పుకొన్నాము. వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మ నివేదనము - వీటి గురించి ఈ రోజు తెలుసుకొందాము.

వందనం : భక్తితో నమస్కరించటం - అక్రూరుడు అట్టి భక్తుడు. ప్రహ్లాదుడు - "పెద్దల బొడగన్న భృత్యుని కైవడి జేరి నమస్కృతుల్ సేయువాడు". పెద్దవారికి భక్తి వినయాలతో నమస్కరించాలి. వందనమ్ మోక్షసాధనమ్ అన్నారు.

దాస్యం : భక్తితో స్వామిని సేవించటం. ఆంజనేయ స్వామి. ఇంకా గుహుడు, శబరి. భక్తికి జాతి, నీతి కుల గోత్రాలు అడ్డు రావు. గుహుడు పడవ నడిపేవాడు. శబరి భిల్ల జాతి స్త్రీ. శ్రీ రామ చంద్రుడు వారిని

అనుగ్రహించలేదా? నీ ప్రతి చర్య దాస్య భావన కలిగి ఉండాలి.
సఖ్యం : స్వామి నా సఖుడు అనే భావం కలిగి ఉండటం. అర్జునుడు., కుచేలుడు. సఖ్యభావం అన్నిటికన్నా గొప్పది. బంధు ప్రీతి అంతంత మాత్రమే. ఆపదలో ఆదుకొనేది నీ స్నేహితుడే.
ఆత్మ నివేదన : స్వామి నా సర్వస్వము. నా మనో వాక్కాయములు నీ సేవ కొరకే అని ఆత్మార్పణం చేసుకోటం . గోపికలది అట్టి భక్తి. భగవంతుడు నా వాడు అని నమ్మారు. మనం కూడా అలా భావన చేయాలి. భక్తి భావనతో ఒక్కొక్క పువ్వు తీసికొని మాల గుచ్చి భగవంతుని గళసీమలో అలంకరిస్తే మన మనస్సు ఆనందం పొందదా? ఆయనను భగవంతుడు అనండి పరబ్రహ్మ అనండి.

పురుష సూక్తం ఏమని చెబుతోంది? **"బ్రాహ్మణోఽస్యముఖమాసీత్, బాహూరాజన్య కృతః,ఊరూతదస్య యద్వైశ్యః పద్భ్యాగ్ం శూద్రో అజాయత ।"**- పరమాత్మని ముఖం నుంచి బ్రాహ్మణులు, భుజములనుండి క్షత్రియులు,ఊరువులనుండి వైశ్యులు, పాదములనుండి శూద్రులు పుట్టారని. మరి ఈ భేద భావాలు ఎక్కడినుంచి వస్తున్నాయి?

"విష్ణుపాదోదకం గంగ" - అంటే శూద్రులకు గంగ సోదరి అయింది కదా! దేశ కాలాలు భూమికే వర్తిస్తాయి. ఆకాశానికి దేశమేది, కాలమేది? శ్రీగురుదేవులు మనకి కీర్తన రూపంలో అందించారు. ఏమని? "ఆకాశమునకేది దేశము, కాలము? భూమికి, ఆకాశానికి కూడా శక్తిని ఇచ్చేది పరమాత్మ శక్తి. దానిని తెలుసుకోవటం ఎవరి తరము?

భక్తి కలుగు కూడు పట్టెడైనను చాలు -" మనం ఎవరింటికైనా వెళ్తాం. వారు ఏది పెడితే అది తినాలి. మనం తినకుండా వెళ్తే వారు బాధ పడతారు. ఏది లభిస్తే దానిని తీసుకుని వారిని తృప్తి పరచటం మన ధర్మం" అని శ్రీ గురుదేవులు ఆచరించి మనకి చూపించారు.

నిరంతరం హరినామం చేస్తూ, హరినామం అంటూ, వింటూ, వినిపిస్తూ విని అని తరించాలని, అట్టి శక్తిని , భక్తిని, భగవన్నామ రసాస్వాదనను, మనందరికీ ప్రసాదించాలని శ్రీగురుదేవులను ప్రార్థిస్తున్నాను.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**ఫిబ్రవరి 2021**

6 శని - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

16 మంగళ - మాఘ శుద్ధ పంచమి శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠా షష్ఠమ వార్షికోత్సవము.

19 శుక్ర - రథసప్తమి. సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

23 మంగళ - భీష్మ ఏకాదశి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

27 శని - మాఘపూర్ణిమ - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

**మార్చి 2021**

8 సోమ - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

11గురు - మహాశివరాత్రి - ఉ॥ 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

28 ఆది - పౌర్ణమి - హోలీ - ఉ॥ 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీమతి వేలమూరి సరోజనీదేవిగారు 27-12-2020 ఆదివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 75 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# అమ్మ ఆలింగన భాగ్యం

- భోగరాజు భారతి దేవి

శ్రీ బాబూజీ ఆరాధనా మహోత్సవాల దీక్షా విరమణ రోజున 10-12-2020 గురువారం నాడు శ్రీమాతాజీ భక్తుల సేవలను కొనియాడారు. శ్రీ బాబూజీ అనుగ్రహంతో శ్రీ బృందావనంపై పుష్పాలంకరణలో సిద్ధహస్తులైన చి॥ కమలను, భారతిని ఎంతగానో కొనియాడారు. పుష్పాలు ఎన్ని వున్నాయో చూసుకుని, ఎలా అలంకరించాలో ముందుగా నిర్ణయించుకుని, ఆకులను కూడా చిన్న ముక్కలుగా కత్తిరించుకుని శ్రద్ధగా అలంకరిస్తారు అన్నారు. ప్రతి చిన్న విషయాన్ని అమ్మ అన్ని పనుల ఒత్తిడిలో ఉండి కూడా గమనించి వివరించారు. రాత్రి 1గంట వరకూ కూడా అలంకరణ చేస్తూ వుంటారు వీళ్ళు అన్నారు. వారి తల్లిగారు కూడా ఎంతో శ్రద్ధగా పువ్వులను సిద్ధ పరుస్తారు అన్నారు. వారి ముగ్గురుకీ మహాప్రసాదాన్ని అందజేశారు. భారతికి, కమలకు ఆలింగన మహద్భాగ్యాన్ని కలిగించారు.

అది చూసినప్పుడు శ్రీరామచంద్రుడు అటువంటి ఆలింగన భాగ్యాన్ని ఇద్దరికి ప్రసాదించాడని మొన్నటి రామాయణ ప్రవచనంలో విన్నాము కదా. హనుమంతుడు, సుగ్రీవుడు వారే ఆ ఇద్దరూ. ఆ విషయం గుర్తుకు వచ్చి నేను మహదానందాన్ని పొందాను. ఆ ఆనందాన్ని అందరం కలిసి పంచుకుందామని అనిపించి ఇది వ్రాశాను.

మరొక విషయమేమంటే, అమ్మ హిందీమాస్టారు వద్ద విద్యను అభ్యసించామని, వారు శ్రీ గురుదేవుల గురించి మాట్లాడుతూ పాఠాలు చెప్పేవారని అన్నారు. అంతేకాక అమ్మ చిన్నతనంలో గుండుగొలనులో శ్రీ సుబ్రహ్మణ్యంగారు, శ్రీరామ మూర్తిగారు, శ్రీరామ శంకరంగారు మొ॥ గురువుల వద్ద కూడా విద్యను అభ్యసించారు. మేము చిన్నప్పుడు అమ్మను ఎత్తుకుని మా ఇంటికి తీసుకువెళ్ళే వాళ్ళం అని ఎంతో ఆనందంగా చెప్పుకునేవాళ్ళం. అలాగే ఆ గురువులు కూడా అమ్మను గురించి ఎంతో ఆనందంగా చెప్పుకునేవారు. సాందీపని వద్ద శ్రీకృష్ణపరమాత్మ విద్యను అభ్యసించిన విషయం గుర్తుకు వస్తుంది. వారంతా ధన్యజీవులు!

'సొగసైన మన అమ్మ బంగారు బొమ్మ' అని సుశీలాప్రసాద గారు వ్రాసినట్లు నిజంగా బంగారు తల్లి కదా. అమ్మ మాట మనం విని నడుచుకుందాం. అలా దీవించమని అమ్మను ప్రార్థించుకుందాం!

# అగస్త్య హృదయం

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాళీప్రసాద్ U.S.A

అగస్త్య మహర్షితో శ్రీరామచంద్రుని ప్రథమ సమాగమాన్ని పరిశీలిస్తే అవినాభావమైన గురు శిష్య సంబంధములో వున్న చాలా విశేషాలు కనిపిస్తాయి. శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై అగస్త్యుల ఆశ్రమ ప్రాంతము చేరుకొని, లక్ష్మణునితో తన రాక గురించి కబురు పెట్టిస్తాడు. లక్ష్మణుడు అగస్త్యమహర్షి యొక్క శిష్యునికి దర్శనార్థియై వచ్చిన రాముని రాక గురించి తెలియజేస్తాడు. తమ శిష్యుని ద్వారా ఆ వార్తను తెలుసుకున్న అగస్త్యమహర్షి శ్రీరాముని వెనువెంటనే తీసుకు రమ్మనమని ఆదేశిస్తూ... **'చిరస్య అద్య ద్రష్టుం మాం సముపాగతః మనసా కాంక్షితం హి'** (అ.కా. 12స, 10 శ్లో) అంటూ తను ఎంతోకాలంగా రాములవారి ఆగమనం కోసం వేచివున్నాననీ, అది తనకు చిరకాలంగా వున్న కోరిక అనీ శెలవిస్తారు. దీనినిబట్టి గురువులు పాత్రత కలిగిన శిష్యుల కోసం ఎదురు చూస్తారనీ, అలాగే వారు నిస్సంగులయినప్పటికీ తమ శిష్యుల హితాన్ని ఎప్పుడూ ఆకాంక్షిస్తుంటారనీ అర్థమవుతుంది.

తమకు పాదాభివందనం చేసిన శ్రీరాముని సంబోధిస్తూ అగస్త్యులు **'రాజా సర్వస్య లోకస్య ధర్మచారీ మహార్థః పూజనీయః చ మాన్యః '** (అ.కా. 12స. 30శ్లో) అంటూ ... నువ్వు సర్వలోకాలను పాలించే నారాయణుడవనీ, ధర్మ సంస్థాపనార్థం మనవుడిలా అవతరించావన్న విషయాన్ని చెప్పకనే చెబుతూ రామావతార ప్రయోజనాన్ని గుర్తు చేస్తారు. అలా గుర్తుచేసి శ్రీరామచంద్రుని కర్తవ్యసాధనవైపు నడిపించడానికే అగస్త్యులు నిరీక్షించి వుంటారు. వెను వెంటనే అగస్త్యులు శ్రీరామునికి దుష్ట శిక్షణార్థం తోడ్పడే విష్ణుచాపమునూ, అక్షయ బాణ తూణీరాలనూ మహేంద్ర దత్తమైన ఖడ్గమును ప్రసాదించి, 'అరిందమా!' (శత్రు నాశకా!) అని సంబోధిస్తూ కాబోయే రాక్షస సంహారమును సూచిస్తారు. అటు పిమ్మట అగస్త్య మహర్షి సీతారామలక్ష్మణులను పంచవటిలో పర్ణశాల నిర్మించుకుని వుండమని ఆదేశిస్తారు.

వారు పంచవటిలో వుండగా శూర్పణఖ రాక, ఖరదూషణాదుల వధ, తదుపరి సీతాపహరణం జరగడం మనకు విదితమే. ఆ విధంగా

వాల్మీకి మహర్షిచేత 'భగవాన్ ఋషి'గా పిలవబడి, భూత, భవిష్యత్, వర్తమానములను ఎరిగిన గురు రూపంలో వున్న అగస్త్యుల నిర్దేశంతో రామాయణం (రాముని యొక్క గమనం) కీలకమైన మలుపు తిరుగుతుంది.

ఈ ప్రకారంగా గురువులు శిష్యులను కాచి వుంటారన్నది సమర్థ సద్గురువులైన శ్రీబాబూజీ మహరాజ్ రక్షణలో వున్న మనకందరికీ అనుభవమే. అంతేకాక శ్రీబాబు 'నేను కామవరపు కోట జీడిని సుమా! ఎన్ని జన్మలైనా అంటిపెట్టుకొనే వుంటాన'ని అభయమిచ్చారు. ఆనాడు వశిష్ఠ, అగస్త్యాది మహామునులు శ్రీరామచంద్రునిపై వర్షించిన ప్రేమ, వాత్సల్యములను శ్రీబాబు ఆశ్రయంలో పొందడము మనమందరమూ చేసుకున్న పూర్వజన్మ సుకృతమే!

తమ ఆదేశము మేరకు కర్తవ్య సాధనలో వున్న శిష్యుడి కార్యసిద్ధికై అగస్త్యులవారే తిరిగి హుటాహుటిన యుద్ధరంగమునకు బయలుదేరి, ఆదిత్య హృదయమును ఉపదేశించి రావణ వధకూ, రామావతార ప్రయోజనమునకూ కారణమవుతారు.

- సశేషం

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఫిబ్రవరి, మార్చి 2021 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***ఫిబ్రవరి 2021 :*** AS 5475, 7221, 7229, 7231, 7232, 7367, 7998, 7999, 8518, 8520.

***మార్చి 2021 :*** AS 2163, 5338, 7244, 7245, 7248, 7685, 8027, 8159, 8522, 8524, 8525,.

# అమ్మతో మాట

(గత సంచిక తరువాయి) - సేకరణ నేలభొట్ల ప్రసాద్

**చేటీ భవన్నిఖిల భేటీ కదంబవన వాటీషు నాకీ పటలీ**
**కోటీర చారుతర కోటీ మణి కిరణ కోటీ కరంబిత పదా**
**పాటీరగంధీ కుచశాటీ కవిత్వ పరిపాటీ మగాధిప సుతా**
**ఘోటీఖురా దధికధాటీ ముదార ముఖ వీటీరసేన తనుతామ్ ॥**

ఆహా! మొదటి శ్లోకమే ఎంత అందంగా వున్నదో చూశావా? ఇలాంటివి 13 శ్లోకాలున్నాయి ఆ స్తోత్రంలో. ఈ శ్లోకాలలో కూడా ఒక చోట నీకు మీ ఆయన మీద వున్న ప్రేమను రసవత్తరంగా చెప్పాడు కాళిదాసు.

**శంభా ఉదార పరిరంభాంకుర త్పులక దంభానురాగ పిశునా** .... అంటాడు. మీ ఆయన నిన్ను గాఢంగా ఆలింగనం చేసుకున్నప్పుడు నీకు కలిగే పులకరింతలు నీకా పరమేశ్వరునిపై వున్న అపారమైన అనురాగానికి సూచికలట.

మీ ఆయన గురించే చెప్పుకుంటూ కూర్చుంటే, నీకూ, నాకూ కూడా ఇక ఈ లోకం పట్టదు. కాబట్టి కాసేపు వేరే విషయాలు కూడా మాట్లాడుకుందాం.

అమ్మా! అసలు మీ అన్నయ్య దశావతారాలను నీ చేతివేళ్ళ గోళ్ళలో నుండి అలా ఎలా పుట్టించావమ్మా? చిత్రం కాకపోతేనూ! **'కరాంగుళి నఖోత్పన్న నారాయణ దశాకృతిః'** అన్న మాట తలచుకుంటేనే భలేగా వుంటుంది. ఇక్కడ ఇంకొక విషయం కూడా చెప్పాలి. మళ్ళీ మరచిపోతానేమో!

**'సాగర మేఖలా'** అనే నీ పేరు కూడా నా కెంత ఇష్టమో! సముద్రాన్నే వడ్డాణంగా పెట్టుకున్నదానవంటగదా! ఎంత బాగుంటుందో తెలుసా ఈ మాట. ఈ నామాన్నే మా ఇంద్రగంటి శ్రీకాంత శర్మగారు ... **'తేనెల తేటల మాటలతో మన దేశ మాతనే కొలిచెదమా.....'** అనే ఒక చక్కని గీతంలో అందంగా వాడారు. **'సాగర మేఖల చుట్టుకొని, సురగంగ చీరగా మలచుకొని ....'** అంటూ నీ నామాన్ని దేశమాతకు అన్వయిస్తూ వ్రాశారు.

అసలు మా సినీ కవులు కూడా నీ మీద పాట వ్రాయవలసిన సందర్భం వచ్చినప్పుడు చెలరేగిపోతారు. ముందుగా నేను మాత్రం మల్లాది రామకృష్ణ శాస్త్రిగారినే చెబుతాను...

**లలిత భావ నిలయ నవ రసానంద హృదయ**

**వికచారవింద నయనా ... సదయా జగదీశ్వరీ**

**మధువుచిలుకు గమకమొలుకు వరవీణాపాణీ**

**సుమరదన విధువదన ... దేవి** ....అంటూ ఆయన వ్రాస్తే, ఆ సాహిత్యానికి మా ఘంటశాల వేంకటేశ్వరరావుగారు బాణీ కట్టారు. మల్లాదివారి సూచన మేరకు, ఈ పాటలో సరస్వతీదేవి వచ్చినప్పుడు సర్వస్వతీరాగంలో, శ్రీదేవి వచ్చినప్పుడు శ్రీరాగంలో, లలితాదేవి వచ్చినప్పుడు లలిత రాగంలో స్వర రచన చేశారు మా ఘంటశాలగారు.

ఇలాంటి పాట వింటూ నా లాంటి పామరుడే పులకించిపోతుంటే, **'కావ్యాలాప వినిదోని'**వి, **'రసజ్ఞ'**వు, **'కావ్యకళా'** రూపిణివి అయిన నీవెంత మురిసిపోతుంటావో కదా! ఆయనే వ్రాసిన **'శ్రీలలితా శివజ్యోతి సర్వకామదా'** అనే పాట కూడా మరో మేలిమి ముత్యం!

**జగముల చిరునగవుల పరిపాలించే జననీ**

**అనయము మము కనికరమున కాపాడే జననీ** ........అంటూ **'అనేకకోటి బ్రహ్మండ జనని'**వైన నిన్ను కీర్తిస్తూ....

**మనసే నీ వశమై స్మరణే జీవనమై**

**మాయని వరమీయవె పరమేశ్వరి మంగళనాయకి** ............ అంటూ మా అందరి తరఫున ఆయనే ప్రార్థించేశారు.

ఇక సముద్రాలగారి **'జననీ శివకామినీ...'**; పింగళిగారి **'శివశంకరీ.....'** పాటలు కూడా మమ్మల్ని ఆనంద డోలికల్లో మునకలేయించినవే.

మా వేటూరి గారి సంగతైతే ఇహ చెప్పనక్కరనే లేదు.

**అఖిలాండేశ్వరి చాముండేశ్వరి**

**పాలయమాం గౌరీ పరిపాలయమాం గౌరీ** ....అంటూ మొదలయ్యే ఆ పాట కాళిదాసుగారి కవిత్వంలాగా పరుగులు తీస్తుంది

- సశేషం

# మానవ సేవయే మాధవ సేవ

- ఎన్. కుట్టీ

ఒక ఊరిలో మాధవుడు, గిరిధరుడు మంచి స్నేహితులు ఏ పని అయినా ఇద్దరు కలిసి చేసేవారు. ఆ వూళ్ళో వారు కొంతమంది కలసి కాశీకి ప్రయాణమయ్యారు. ఎన్ని రోజుల నుండో అనుకుని, మాధవుడు, గిరిధరుడు కూడా  కలసి వారి గ్రామ ప్రజలతో కాశీకి వెళ్ళాలని నిశ్చయించుకున్నారు.

ఆ పవిత్రమైన రోజు రానే వచ్చింది. మాధవుడు, గిరిధరుడు వారితో కలసి ప్రయాణమయ్యారు. కాశీకి కొంత దూరం నడిచి ప్రయాణించాక, వీళ్ళిద్దరూ దారి తప్పిపోయారు. మిగతా గ్రామ పౌరులు ముందు వెళ్ళిపోయారు. ఆ పౌరులు మాధవుడు, గిరిధరుల కోసం ఎదురు చూసి ముందుకు సాగిపోయారు. ఇక్కడ మాధవుడు, గిరిధరుడు కూడా వారందరి కోసం వెతికి, వెతికి ముందుకు సాగిపోయారు.

ఇద్దరూ అలా నడుస్తూ నడుస్తూ పొద్దుగూకింది. అది ఒక అడవి. అక్కడ పెద్ద పెద్ద జంతువులు తిరుగుతున్నాయి. వీరిదగ్గర తెచ్చుకున్న ఆహార పదార్థాలు అన్ని అయిపోయాయి. అసలే అడవి ప్రాంతం అక్కడ ఏమీ దొరకవు. ఇద్దరికీ ఆకలి మాడిపోతోంది. నడిచే ఓపిక నశించింది. ఏమీ దిక్కు తోచడం లేదు. ఎక్కడైనా చెట్టు క్రింద విశ్రమిద్దామంటే అసలే చీకటి. ఏ పులులు, సింహాలు మీద పడతాయేమో అని భయం. అలాగే ఇద్దరూ నడుస్తున్నారు. ఎవరైనా కనబడతారా, ఎవరైనా ఆ రాత్రికి ఆశ్రయం ఇస్తారా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. నర సంచారం లేదు. కారు చీకటి. ఏమీ కనబడటం లేదు. భయం భయంగా వుంది. అలాగే భయంతో నడుస్తున్నారు ఇంక ఏమీ చేయలేక.

ఇంతలో భగవంతుడు దయచూపినట్లుగా మాధవుడికి ఆ అడవిలో ఎక్కడో దూరాన ఏదో వెలుతురు కనిపించింది. 'ఓ గిరిధరా! ఆ చివరన ఏదో వెలుతురు కనబడుతోంది. అటు చూడు' అన్నాడు. గిరిధరుడు చూసి, 'మాధవా! ఈ చిట్టడవిలో వెలుతురు ఏదో అయివుంటుంది. అటు పోవడం అంత మంచిది కాదు. ఒక వేళ అది ఏ దయ్యమైనా అయి వుండవచ్చు. అటువైపు వెళ్ళి మనం ఏదో ఒక

ఇబ్బందుల్లో పడతాం. కనుక వద్దు' అన్నాడు. అప్పుడు మాధవుడు 'గిరిధరా! మనం ఇంకా చాలా దూరం వెళ్ళాలి. అందులోనూ కటిక చీకటి. ఎటు వెడుతున్నామో కూడా తెలియడం లేదు. ఈ మధ్యలోనే ఏ పులో, సింహమో వచ్చి మనలను చంపవచ్చు. మనం ఇప్పుడు అన్నిటికీ తెగించిన వాళ్ళం. మనం ఆ కాశీ విశ్వేశ్వరుని నమ్మి ప్రయాణం అయ్యాం. మనకి ఆయనే వున్నారు. అక్కడకి వెళ్ళి చూద్దాం' అన్నాడు. ఇద్దరూ కలసి ఆ దీపం వైపు కాలి నడక సాగించారు.

అది ఒక పూరి గుడెసె. భయం భయంగానే ఇద్దరూ బిగ్గరగా లోపల ఎవరైనా వున్నారా? అని చాలాసార్లు అరిచారు. లోపలి నుండి ఏ జవాబూ లేదు. ఇద్దరూ భయంగానే లోపల అడుగు పెట్టారు. లోపల ఒక బుడ్డి దీపం. ఒక మూలగా ముసలి అవ్వ కూర్చుని వున్నది. మాధవుడికి, గిరిధరుడికి భయం వేసింది. అది ఏమైనా దయ్యమా అని. ఆ అవ్వ దగ్గరకు వెళ్ళి పలకరించారు. 'అమ్మా! మీరెవరో చాలా పెద్ద వయసు గలవారు. ఇక్కడ ఎవరితో వుంటున్నారు?' అని అడిగారు. 'నాయనలారా! నాకెవ్వరూ లేరు. నేను ఒంటరిగానే వుంటున్నాను. నాకు విధి లేదు. నాకు దేనికీ భయం  లేదు' అన్నది. అప్పుడు వారు ఆ అవ్వతో 'అమ్మా! మేము కొంతమందితో కలసి కాశీకి బయలుదేరాము. మా వూరి వారితో కలసి వెడుతుండగా మధ్యలో మేము దారి తప్పిపోయాము. వాళ్ళు వెళ్ళిపోయారు. దారీతెన్నూ తెలియకుండా మేమిద్దరం తిరుగుతూవుంటే మాకు మీ గుడిసె కనబడింది.  మీరు అనుమతి ఇస్తే ఈ రాత్రికి ఇక్కడే గడిపి రేపు ఉదయాన్నే మేము కాశీకి బయలుదేరతాము' అన్నారు. ఆమె 'నాయనలారా! మీరిక్కడే వుండవచ్చు' అన్నది. ఆమె నెమ్మదిగా ఓపిక చేసుకుని, వారికి వంట చేసి పెట్టింది. వారిద్దరూ తృప్తిగా భోజనం చేసి ఆ రాత్రికి అక్కడే నిద్రపోయారు. ఆ అవ్వ రాత్రి తెల్లవార్లూ మూలుగుతూ వుంది. జ్వరంతో ఒళ్ళంతా కాలిపోతోంది. అసలే లేవలేదు. ఇప్పుడు ఇంకా లేవలేకపోతోంది.

గిరిధరుడు 'అమ్మా! మీరు అనునతిస్తే మేము కాశీకి బయలుదేరతాం' అన్నాడు. ఆమె మూలుగుతూ 'వెళ్ళిరండి నాయనా!' అన్నది.

- సశేషం

# రామాయణంలో స్త్రీ పాత్రలు

-సుషమ్నా ప్రసాద

(గత సంచిక తరువాయి)

## సీత

పతిదేవుని మాటకు సీత కుపితురాలై 'నాథా! మీ మాటలు నాకు అర్థ రహితంగానూ, హాస్యాస్పదంగానూ వున్నాయి. నాకు కించిత్ అయినా బోధ పడలేదు. స్వామీ! మీకు తెలియని ధర్మమేమున్నది? భార్య ఒక్కతే భర్త యొక్క భాగ్యాన్ని పంచుకుంటుంది. మిమ్మల్ని వనవాసానికి వెళ్ళమంటే, మీ అర్ధాంగియైన నన్ను కూడా వెళ్ళమని అర్థం. స్త్రీకి గమ్యం భర్త ఒక్కడేగాని, తల్లి, తండ్రి, తనయులు, చెలియలు కారు.

**ఇదా ప్రేత్య చ నారీణాం పతిరేకో గతిః పరాత్పరః** - భర్త ఒక్కడే స్త్రీకి ఉత్తమ గమ్యము. కనుక మీతోపాటు నేనూ అరణ్యానికి వస్తాను. మీకు ముందుగా నడుస్తూ దారిలో రాళ్ళు ముళ్ళు తొలగించి మీ ప్రయాణం సుగమం చేస్తాను. పైగా నేనది కష్టంగా భావించను. మేడల కన్నా భర్త పాదచ్ఛాయలో నివసించడమే భార్యకు విశిష్టము. మీ పాదసేవ తప్ప ఈ ముల్లోకాలలో దేని యందు కూడా నాకు ఆశ లేదు. నన్ను విశ్వసించండి. పతిసేవా భాగ్యముతో నేను అరణ్యమునే పుట్టినిల్లుగా భావించి, హాయిగా జీవిస్తాను. **అనుశిష్టా చ మాతాచ పితాచ వివిధా శ్రయకరి నాస్తి సంప్రతివక్త వ్యావర్తితవ్యం యధా మయీతా** - 'అనేక విషయాలను గురించి నా తల్లిదండ్రులు నాకు పూర్వమే చెప్పియున్నారు. నా ప్రవర్తన విషయంలో ఎవరి ప్రమేయం లేకుండానే నేను ప్రవర్తించగలను.'

పై మాటలలో మనకు సీతాదేవి ఎంతటి ధీరోదాత్తయో, ప్రజ్ఞావంతురాలో, ఎంతటి ఆత్మ విశ్వాసం వున్న భర్తృసేవా పరాయణురాలో మనకు పూర్తిగా అవగతమవుతోంది. భర్త సాన్నిధ్యం లేకుంటే ఆమె దృష్టిలో రాజభోగాలన్నీ తృణ ప్రాయములే. భర్త సన్నిధియే ఆమెకు దివ్యమైన పెన్నిధిగా భావించింది. ఆమె మహిళలలో మాణిక్య ప్రభ వంటిది. నారీలోకం నాడీమండలంలో సీతమ్మ రక్తం, ఆశీస్సులు ప్రభావితం చేసేటంత వరకు, భారతీయ మహిళ భావితరాలకు ఆదర్శమూర్తిగా ప్రకాశించగలదు. అలా శ్రీరామచంద్రుడు తన వెంట రావద్దని చెప్పడానికి నిరుత్తరగా మార్చివేసింది.

సీతమ్మ రామునితో 'నేను మీ అడుగుజాడలలో నీడలాగా

నడుస్తాను. మీకెలాంటి బాధను కలుగజేయ కుండా కందమూలాలను షడ్రసోపేతమైన భోజనంగా ఆనందంతో స్వీకరిస్తాను. మీరు నా చెంత వున్నంత వరకూ నాకెలాంటి చింతలకు తావులేదు. మీరు లేని స్వర్గము కూడా నాకు నరకము కంటే తుచ్ఛంగా వుంటుంది. మీకు దూరమై జీవించవలసి వస్తే, నాకు మరణమే శరణ్యము. ఎట్టి పరిస్థితులలోనూ మీరు నన్ను మీ వెంట తీసుకువెళ్ళడమే శ్రేయస్కరము, ఆనంద దాయకము' అన్నది.

అరణ్యంలో అనేక బాధలుంటాయి. క్రూరమృగాలు, విషసర్పాలు, క్రిమికీటకాలకు నిలయం. సుకుమారి, కుసుమ కోమలి అయిన సీతమ్మను అలాంటి బాధలకు గురిచేయకూడదని భావించి శ్రీరాముడు ఆమెను వనాలకు రావద్దని ఎంతగా నిరాకరించినా సరే, సుధీర సాహస మూర్తి ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోగల సమర్థురాలు అయిన సీతమ్మ శ్రీరామచంద్రుని మాటలకు కుపితురాలై రామచంద్రునితో పరుషంగా మాట్లాడి ఆయన అంగీకరించేటట్లుగా 'రామా! నీవు పురుషాకారంలో వున్న స్త్రీగా ప్రవర్తిస్తున్నావు. మా నాన్నగారు ఏమి చూసి మిమ్మల్ని అల్లుడిగా స్వీకరించారో నాకు అర్థం కావడం లేదు.

హే రఘుకుల తిలకమా! మీలో ప్రకాశం లేదేమో అని ఎవరైనా శంకిస్తే అది వారు సూర్య ప్రకాశమును శంకించినట్లే. మీరు ఏదో బలవత్తరమైన కారణంతో నన్ను రావద్దు అంటున్నారు. మీ సాహచర్యము లేని భోగభాగ్యములు నాకు తృణప్రాయములు. మీ సన్నిధియే నాకు పెన్నిధి. మిమ్ములను పెనవేసుకున్న లతను. మిమ్మల్ని విడచి 14సంవత్సరాలు ఈ లత వాడిపోయి వడిలిపోతుంది, రాలిపోతుంది ప్రభూ!' అంటూ శ్రీరామచంద్రుని ఆలింగనం చేసుకున్నది.

ఆర్తత్రాణ పరాయణుడైన రామచంద్రుడు ఆమెను తన కౌగిట్లో సేదతీర్చి తన వెంట అరణ్యవాసానికి తీసుకు వెళ్ళేందుకు వుద్యుక్తుడయ్యాడు. అలా సీతారామ లక్ష్మణులు అరణ్యకాండలో ప్రవేశించారు.

- సశేషం

# శ్రీశ్రీశ్రీ బాబూజీ మహరాజ్‌వారితో

(గత సంచిక తరువాయి) **అనుభవాలు** -వి. లక్ష్మీ నరసమాంబ

ఇంతలో వారు ప్రసంగిస్తూనే సందర్భోచితంగా ............
'కొందరుంటారు! వారు ఎందుకు సత్సంగ సమావేశాలకు వస్తారో అర్థం కాదు. ఇక్కడకు వచ్చేది ప్రాపంచిక విషయాదులు మరచిపోయి, ఏదో కొంత మనశ్శాంతి పొందాలని కదా! కానీ, వారు ఆ విషయం మరచిపోయి, ప్రాపంచిక విషయాలలో పడిపోతారు. వారు మాత్రమేనా! వారి ప్రక్కన వున్న వారిని కూడా మాటల్లోకి లాగి, వారి సత్సంగాన్ని కూడా పాడుచేస్తారు' అంటూ మా వైపు కాకుండా మరోకవైపు చూస్తూ, చివాట్లు పెట్టారు. ఆశ్చర్యపోవడం, లెంపలు వేసుకోవడం నా వంతు అయింది. 'అక్కా! అక్కా! చూశావా?' అంటూ మా అక్కవంక చూశాను. 'తెలిసిందిలే' అన్నట్లుగా నవ్వింది ఆమె.

**ఇలాంటి సంఘటనలెన్నో! ............................**

ఒకసారి ఆశ్రమానికి దశమి పూజ కార్యక్రమానికి తయారై వెడుతున్నాను. నన్ను మా పెద్ద కోడలు కుముద ఆపి 'అత్తా! మీ అబ్బాయి తన ఉద్యోగంలో చాలా కఠినమైన పరీక్షకు కూర్చున్నారు. అందులో తప్పక పాస్ కావాలని ప్రార్థించండి' అంది. హైదరాబాద్‌కు పెద్ద కొడుకూ, కోడలూ వచ్చి వుండేది కొద్ది రోజులు మాత్రమే. ఆ కొద్ది రోజుల్లో ఎన్నో పనులు పెట్టుకుని వుంటారు. అందువల్ల కోడలు నాతో ఆశ్రమానికి రాలేదు. కానీ, పూజా ఫలం తనకు కూడా దక్కాలని కోరుకుంటోంది. 'సరే' అని తల ఊపి ఆలోచనలో పడ్డాను.

'బాబూజీని ఏమైనా కోరాలంటే కనీసం ఆయన దర్శనం అయినా చేసుకోవాలి కదా! మరి నేను ఆశ్రయించి, వారిని సేవిస్తే, నా పిల్లలకు కూడా లాభం చేకూరుతుందా?' ఇలా ఆలోచిస్తూ సత్సంగంలో కూర్చున్నాను. పూజ పూర్తి అయింది. పూజ అనంతరం ఒక భక్తురాలు బాబుగారి బోధామృతాన్ని చదువుతున్నారు. చదువుతూ, చదువుతూ - 'మనం బాబుగారిని ఆశ్రయించాము. ఆయనకు సేవ చేసుకుంటున్నాము. ఆయనకు విధేయులమై వున్నాము. అందుమూలంగా మనకు మంచి జరగడం సహజమే! కానీ, మన

పిల్లలకు కూడా మేలు కలుగుతుందా? అని మనలో చాలా మందికి సందేహం రావచ్చు. కానీ, బాబుగారు తనను ఆశ్రయించిన మీ సుఖసంతోషాలను కాపాడుతూ వుంటారు. అంటే మీ పిల్లలను కూడా సంరక్షిస్తున్నట్లే కదా! ఎందువల్లనంటే మీ పిల్లలు దుఃఖపడుతూ వుంటే, మీరెలా సంతోషంగా వుండగలరు? అందువలన బాబుగారి రక్ష వారికి కూడా లభిస్తుంది' అంటూ చదివారు. ఇంతకన్న ఆశ్చర్యకరమైనది ఏమైనా ఉందా?

## కామ క్రోధాలకు అతీతంగా

ఒకసారి నేను విజయవాడ వెళ్ళినప్పుడు, మా పాత పరిచయస్థులలో ఒకరైన ఒక ప్రముఖ గాంధేయవాదిని కలవడం జరిగింది. ఆయన 'లక్ష్మిగారూ! మీరు విశ్రాంత ఉద్యోగిని కదా? గాంధీ సాహిత్యమంతా క్రోడీకరించి, విషయాన్ని సబ్జెక్ట్ వైజ్‌గా మీరు టైపు చేయించాలి. మీరు ఆ పనికి ఒప్పుకుంటే, మీకు ఒక ఆఫీసును, ఒక కంప్యూటర్, ఒక టైపిస్ట్‌ను మీకోసం ఏర్పాటు చేయగలను. అది చాలా ప్రముఖమైన గ్రంథం అవుతుంది. దాని ప్రచురణకు కూడా నిధులు సంపాదించగలను' అన్నారు. నేను ఆలోచనలో పడ్డాను. ఆయన ప్రతిపాదన గొప్పదే! కానీ, నేను ఆ పని చేయాలంటే, రెండు లేక మూడు సంవత్సరాలు విజయవాడలో వుండాల్సి వస్తుంది. పైగా, ఆయనకు గతంలో వేరే వారితో పని చేయించి, తన పేరు ఆ పుస్తకానికి పెట్టుకున్న చెడ్డపేరు వుంది. అందువల్ల ఈ పనికి ఒప్పుకోవడం ఎంతవరకు సబబు? అని ఆలోచిస్తూ, తిరుగు ప్రయాణంలో, ఆశ్రమానికి బాబూజీ దర్శనానికి వెళ్ళాను. నేను వెళ్ళేటప్పడికి మునుపటి వలె మధ్యాహ్నం అయింది. బృందావనంలో ఎవరో ఒక భక్తుడు బాబుగారి బోధామృతం మైకు దగ్గర చదువుతున్నారు. నేను కూర్చుని వింటున్నాను. ఒక పది నిమిషాలు గడిచాయి. ఇంతలో - 'మన జీవితాన్ని కొన్ని సమయాలలో కామక్రోధాలు చుట్టిముట్టి, పెనవేసుకుని క్రింద పడేయాలని చాలా ప్రయత్నం చేస్తాయి. అలాంటి సమాయల్లో గురువును ఆశ్రయించి, వారి ఆదేశానుసారం నడుచుకుంటే, వాటి ప్రమాదం నుండి సులభంగా బయటపడతారు' అని ఆ భక్తుడు చదివాడు.

- సశేషం


సుఖం
మధుప
అబ్బ! ఈ గారెలు భలే ఉన్నాయి! ఎన్ని తిన్నా ఇంకా తినాలనిపిస్తోంది.
1
ఇప్పటికే నక్షత్రమాల (27) గారెలు తిన్నారు. ఇంక చాలండీ!
లేదు, నాకింకా కావాలి
2


అబ్బా! కడుపు
నొప్పి!
మబ్బులు
3
గుడ గుడ
ఉరుములు
మెరుపులు
4


వర్షం
5
ఇంట్లో వాళ్ళు
ఘొల్లు
6


డాక్టర్ సంచీ ఘల్లు ఘల్లు
7
గారెలు బాగున్నాయని అతిగా తింటే కడుపులో ఉరుములు, మెరుపులు వచ్చి వర్షం మొదలౌతుంది. ఇంట్లో వాళ్లు ఘొల్లుమంటారు, డాక్టర్ సంచీ ఘల్లుమంటుంది. ప్రపంచంలో సుఖాలన్నీ ఇలాగే ఉంటాయి. సుఖం వెనకాలే కష్టం దాగి ఉంటుంది. ఆత్మసుఖమే అసలైన సుఖం.
8

# భీష్మాచార్య

-పాలూరి కాళీప్రసాద్

మహాభారతంలో భీష్మపితామహుల వారిది అత్యంత విశిష్ఠమైన పాత్ర. భీష్ముడు గత జన్మలో అష్టవసువులలో ఒకడైన ప్రభాసుడు. ఒకనాడు అష్టవసువులు తమ భార్యలతో కలసి వశిష్ఠులవారి ఆశ్రమానికి వెళ్ళినప్పుడు ఈ ప్రభాసుడి భార్య అక్కడ వున్న నందినీ ధేనువును తరలించుకు పోవాలని కోరుతుంది. భార్యను సంతోషపెట్టడానికి ప్రభాసుడు ఆ ధేనువును దొంగిలిస్తాడు. దానికి మిగిలిన ఏడుగురు వసువులూ కూడా సహకరిస్తారు. అప్పుడు వశిష్ఠుడు వారందరని మానవ లోకంలో జన్మించమని శపిస్తాడు. వారంతా వేడుకొనగా, అసలు పాపం చేసిన ప్రభాసుడు మాత్రం చిరకాలం మానవజన్మలో గడపవలసి వుంటుందని, మిగిలినవారు జన్మించగానే శాపవిమోచనం కలిగి తిరిగి వసులోకానికి చేరతారని శెలవిస్తారు.

ఆ అష్టవసువులూ గంగామాతను తమకు తల్లిగా ఉండమని ప్రార్థించి, శంతన మహారాజుకు, ఆవిడకు పుత్రులుగా జన్మిస్తారు. మొదటి ఏడుగురునీ ఆవిడ పుట్టగానే గంగానదిలో ముంచి, శాప విమోచనం కలిగించడం, ఎనిమిదవవాడైన ప్రభాసుని కూడా ముంచబోతుంటే శంతనుడు వారించడం, అతడు చిరకాలం మానవ రూపంలో జీవించవలసిరావడం మనకు తెలిసినదే.

పూర్వం జడభరతుడు సర్వసంగ పరిత్యాగం చేసి కూడా ఒక చిన్న లేడి పిల్లమీద జాలితో దగ్గరకు తీసి, దానిమీద మమకారం పెంచుకుని చివరకు దాని ధ్యాసలోనే మరణించి పునర్జన్మను పొందుతాడు. అయితే మరుజన్మలో గతజన్మ స్మృతి వుండటంతో మళ్ళీ అటువంటి వలలో పడకూడదని, సర్వకర్మలను పరిత్యజించి, జడునిగా జీవిస్తూ జడభరతుడనే పేరు తెచ్చుకుంటాడు.

అలాగే శాపవశాత్తూ దేవవ్రతునిగా జన్మించిన ప్రభాసునికి కూడా గతజన్మ స్మృతి వున్నదేమో అనిపిస్తుంది. గతజన్మలో భార్యమీద మోహం కొద్దీ తాను చేసిన కర్మ వల్లనే ఈ మానవ జన్మ ఎత్తవలసి వచ్చిందనే జ్ఞానం ఎక్కడో బీజరూపంలో వున్నదనిపిస్తుంది. తాను ఆ కాలంలో సంపూర్ణ భారతావనిలో అత్యంత శక్తిమంతుడు, సకల విద్యాపారంగతుడు అయినప్పటికీ తనకోసం ఎట్టి కర్మలూ ఆచరించడు.

చిన్నతనంలో తల్లి ఎలా చెపితే అలా నడుచుకోవడం, ఆ తల్లి

తనను శంతనుడికి అప్పగించిన తరువాత ఆయన కోసమే తన జీవితాన్ని అంకితం చేయడం మనం గమనించవచ్చు. తన తండ్రి మత్స్య కన్య మోహంలో పడి దుఃఖితుడై వున్నప్పుడు, అదే అదనుగా భావించి తాను రాజ్యాన్ని, సంసార సుఖాలను త్యజించి, ఎవరు రాజైనా తాను హస్తినాపుర సింహాసనానికి బద్ధుడనై తన జీవితం గడుపుతానని భీషణ ప్రతిజ్ఞ చేసి భీష్ముడిగా వినుతికెక్కాడు దేవవ్రతుడు.

తండ్రి మరణం తరువాత తాను దక్షుడై వుండి కూడా అసమర్థుడైనా విచిత్రవీర్యుడిని రాజుగా చేస్తాడు. తల్లి ఆజ్ఞ మేరకు ఆ విచిత్రవీర్యుని కొరకు అంబ, అంబిక, అంబాలికలను వారి స్వయంవరం భగ్నం చేసి మరీ తీసుకువస్తాడు. తాను చేసిన ఆ పనివలన అంబ జీవితం నాశనమైపోయినా తాను మాత్రం తన నిస్సంగత్వానికే కట్టుబడి వుంటాడు. విచిత్రవీర్యుడు మరణించాక కూడా తాను మాత్రం రాజ్యం స్వీకరించకుండా కర్తవ్యాన్ని సత్యవతికే వదిలివేస్తాడు.

భీష్ములవారి జీవితాన్ని తప్పుపట్టే స్థాయి మనకు ఎవరికీ లేదు. కానీ, వారి జీవితాన్ని మరో దృక్కోణంలో చూడటానికి చేస్తున్న ప్రయత్నమే ఇది. ఇక్కడ ప్రతిజ్ఞ గురించి మాట్లాడుకుంటే మరి శ్రీకృష్ణుడు కూడా తాను మహాభారత యుద్ధంలో కేవలం సలహాలు మాత్రమే ఇస్తాను కానీ ఆయుధం చేపట్టనని ప్రతిజ్ఞ చేస్తాడు. కానీ, ధర్మరక్షణ కోసం, అర్జునుని రక్షించడానికి, అలాగే తనతో ఆయుధం పట్టించాలనే తన భక్తుడైన భీష్ముని కోరికను నెరవేర్చడానికి తన ప్రతిజ్ఞను సైతం పక్కకు పెట్టి, చక్రాన్ని చేపట్టి భీష్ముని పైకి లంఘించాడు. కానీ భీష్ముడు మాత్రం ఎంతటి ధర్మసంకటం ఎదురైనా కానీ, ధర్మగ్లాని కలిగినా, తన ప్రతిజ్ఞకే కట్టుబడి నిష్క్రియంగానే వుండిపోయాడు. అలాగే రాజాజ్ఞ మేరకు ఉత్తర గోగ్రహణంలో, మహాభారత యుద్ధంలో కూడా అధర్మ పక్షానే నిలిచాడు.

ఒక విధంగా చూస్తే తనకు సమర్థత లేనప్పటికీ విదురుడు తనకు చేతనైనంతలో ఎప్పటికప్పుడు కౌరవుల కుతంత్రాలను కనిపెడుతూ, పాండవులను హెచ్చరిస్తూ, వారినీ, ధర్మాన్నీ కాపాడుతూ వచ్చాడు. అందుకే రాయబారానికి వెళ్ళినప్పుడు కృష్ణుడు విదురుని ఇంటికి వెళ్ళి ఆయనను అనుగ్రహించాడు అనిపిస్తుంది. భీష్మునికి ధర్మం పాండవుల పక్షానే వున్నదని మొదటి నుండి తెలిసినా, మనస్సులో పాండవుల క్షేమాన్ని, అభ్యుదయాన్నే కోరుకుంటున్నా, అందుకు తగిన కర్మలను మాత్రం

చేయలేక పోయాడు. ద్రోణాచార్యులవారు కూడా అన్నీ తెలిసినా గ్రుడ్డిగా భీష్ములవారినే అనుసరించారు. అందుకే రాయబారంలో పరమాత్మ **సారపు ధర్మమున్ విమల సత్యము, పాపముచేత, బొంకుచే పారము పొందలేక చెడబారినదైన యవస్థ దక్షులెవ్వారలు ఉపేక్ష చేసిరది వారల చేటగు గాని ధర్మ నిస్తారకమయ్యు సత్య శుభదాయకమయ్యును దైవముండెడిన్** - సత్యధర్మాలు పాపము, బొంకువలన ఎప్పుడైతే దురవస్థలపాలై తిరిగి వృద్ధిపొందే దారికానక క్షోభిస్తాయో అప్పుడు తాము దక్షులై వుండి కూడా ఉపేక్ష చేసినవారికి అది తప్పక చేటు చేస్తుంది. అయితే సత్యధర్మాలను వుద్ధరించడానికి భగవంతుడు ఎప్పుడూ సిద్ధంగానే వుంటాడని వారిరువురినీ హెచ్చరిస్తాడు.

సంసార బంధముల నుండి విడివడి ముక్తిని పొందటానికి కర్మపరిత్యాగం ఎంతమాత్రం మార్గం కాదని, 'నేను చేస్తున్నాను. దీని ఫలితం నాకు కావాలి' అనే కర్తృత్వ, భోక్తృత్వ అహంకారాలను విడిచిపెట్టి నిష్కామంగా తన కర్తవ్యాన్ని ఆచరించడమే ముక్తికి మార్గమని కృష్ణుడు బోధించిన గీతాసారాన్ని ఎట్టకేలకు గ్రహించిన భీష్మాచార్యులవారు, హస్తినాపుర సింహాసనానికి కట్టుబడి ఉంటాననే తన ప్రతిజ్ఞను ప్రక్కన పెట్టి, ధర్మవిజయానికై పాండవులు తనను జయించే మార్గాన్ని తెలియజేస్తారు. అలా తన బోధను అర్థం చేసుకుని ఆచరణలో పెట్టిన భీష్ముని పట్ల భగవానుడు అత్యంత ప్రసన్నుడై ఆయన అంత్యకాలంలో భాగవతోత్తములందరినీ వెంటబెట్టుకుని, ఆయనకు దర్శనమిచ్చి, ఆయన ముఖస్తుగా విష్ణుసహస్రనామాలను ప్రవహింపజేసి, ముక్తిని ప్రసాదించాడు.

**కర్తా కారయితా చైవ ప్రేక్షకశ్చ అనుమోదకః సుకృతం దుష్కృతం చైవ చత్వారః సమభాగినః** - అని ఆర్యోక్తి. ఒక మంచి పనికైనా, చెడ్డ పనికైనా చేసినవాడు, చేయించినవాడు, చూస్తూ కూర్చున్నవాడు, దానిని ఆమోదించి ఆనందించినవాడు ఈ నలుగురూ దాని ఫలితాన్ని సమానంగా పొందుతారని దీని భావం. ఈనాడు లోకంలో జరుగుతున్న అనేక అన్యాయాలను చూస్తూ, వాటిని ఆపే సమర్థత, కనీసం ఇది తప్పని చెప్పే పెద్దరికం వుండి కూడా 'వారిపాపాన వారే పోతారులే, మనకెందుకు?' అని ఊరుకునేవారు ఇది తప్పక తెలుసుకోవలసిన విషయం.

# మధురం మధురం మధురం

(గత సంచిక తరువాయి) - విజయ రాఘవీయం

ఈ విషయం స్వయంగా సీతాదేవి అత్రిమహర్షి భార్యయైన అనసూయదేవి 'మీ వివాహం ఎలా జరిగింది?' అని అడిగినప్పుడు చెప్పింది. ఇక్కడ శ్రీరాముడు అయాచితంగా అవకాశం వచ్చిందని సీతను వివాహం చేసుకోలేదు. ధర్మాన్ని అనుసరించి, పెద్దలను గౌరవించి, తండ్రి అన్నివిధాల విచారించి, అనుజ్ఞ ఇచ్చిన తరువాతనే సీతతో వివాహానికి అంగీకరించాడు. అది ఆయన నిష్ఠ మరియు గొప్పదనం. ఎటువంటి సమయంలో కూడా అది ఆనంద సమయం కావచ్చు, లేదా దుఃఖ సమయం కావచ్చు, సంయమనం కోల్పోకుండా, స్థిర బుద్ధితో ధర్మమునను సరించి, ఆలోచించి, నిర్ణయం తీసుకొని అలా నడుచుకొనేవాడు. ఆయన సుఖదుఃఖాలకు అతీతుడు. అందుకే శ్రీరాముడు భావాతీతుడని కొనియాడబడ్డాడు.

యుద్ధ సమయంలో విభీషణుని శరణాగత ఘట్టం ఒకటి మరువలేనిది. అన్న లంకేశ్వరునితో విభేదించి, తాను చేస్తున్నది తప్పు అని, ధర్మవిరుద్ధమని స్పష్టంగా ధైర్యంగా రావణునితో చెప్పి, లంక నుండి బయటకు పంపించివేయబడిన విభీషణుడు శ్రీరాముడిని శరణుజొచ్చాడు. రామ సుగ్రీవుల వైపుకు తన మంత్రులతో కలసి వచ్చిన విభీషణుడు ఆకాశంలోనే వుండి శ్రీరాముడిని శరణువేడుకొన్నాడు. ఆ సమయంలో శ్రీరాముని చుట్టూ పరివేష్టించి వున్న సుగ్రీవాదులు విభీషణుని అతని సహచరులను చూశారు. అప్పుడు సుగ్రీవుడు రాముని దగ్గరకు వచ్చి, 'ఆ వచ్చినది రావణుని సోదరుడు విభీషణుడు. గూఢచారితనానికి వచ్చి వుంటాడు. అతనిని నమ్మవద్దు. అతనికి శరణు ఇవ్వద్దు' అని చెబుతాడు. అప్పుడు శ్రీరాముడు అక్కడ వున్న మిగతావారి వంక చూస్తూ, 'ఈ విషయంలో అంటే విభీషణునికి శరణాగతి విషయంలో ఎవరైనా ఏదైనా సలహాను నిర్భయంగా ఇవ్వవ'చ్చన్నాడు.

అప్పుడు జాంబవంతుడు వచ్చి 'రామా! శత్రుపక్షం వానికి తొందరపడి శరణు ఇవ్వడం అంత మంచిది కాదు. మనలో మాటలలో నేర్పరి, విషయాన్ని సునిశితంగా పరిశీలించ గలిగిన, తెలివైన ఒకరిద్దిరిని, వారివద్దకు పంపించి అసలు విషయాన్ని గ్రహించాలి. తరువాత మనం

నిశితంగా విచారించి నిర్ణయాన్ని తీసుకోవచ్చు' అన్నాడు. తరువాత మరికొందరు గూఢచారులను పంపిచవచ్చని, లేదా నీతి మంతులను పంపమని, మరికొందరు అసలు శత్రువుకు శరణాగతి ఇవ్వరాదని ఇలా రకరకాలుగా అభిప్రాయాలు చెప్పారు.

అన్నీ విన్నతరువాత శ్రీరాముడు మారుతి వంక చూసి, 'హనుమా! నీ అభిప్రాయమేటి?' అని అడిగాడు. హనుమ మాట్లాడుతూ 'స్వామీ! విభీషణుడు శరణుకోరి వచ్చి ఆకాశంలో నిలబడి వున్నాడు. ఇప్పుడు గూఢచారులను ఎక్కడికని పంపిస్తాము? శత్రు శిబిరం నుండి వచ్చినవాడు శరణుకోరడం నమ్మదగినది కాకపోయినా, విభీషణుడు తన సోదరునితో విభేదించి, ఆయనను త్యజించి రావడం సత్యదూరం కాకపోవచ్చు. ఎందుకంటే పూర్వం నేను లంకలో పర్యటించినప్పుడు విభీషణుని మందిరంలో దైవప్రార్థనలను విన్నాను. అలాగే రావణుని సభలో ధర్మం గురించి మాట్లాడినవాడు విభీషణుడు ఒక్కడే. కాబట్టి పూర్వాపరాలు ఆలోచించి, తమరే సరియైన నిర్ణయం తీసుకోవలసినది' అని చెప్పి కూర్చున్నాడు.

- సశేషం

***పెదనింద్రకాలను శాఖలో కార్యక్రమాలు***

*** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

***ఫిబ్రవరి 23 మంగళవారం నుండి 27 శనివారం వరకు***
***వార్షిక సత్సంగ సమావేశములు జరుగును.***

**ఫిబ్రవరి 2021**

6 శని - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

23 మంగళ - భీష్మ ఏకాదశి - శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠా వార్షికోత్సవం . శ్రీసద్గురు పాదపూజ.

27 శని - మాఘపూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ

**మార్చి 2021**

8 సోమ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

11 గురు - మహాశివరాత్రి - సద్గురుపాదపూజ, భక్తసమారాధన.

28 ఆది - పౌర్ణమి - హోళీ - శ్రీసద్గురుపాదపూజ.

(గత సంచిక తరువాయి)

# శ్రీకృష్ణ జన్మాష్టమి

-సుషుమ్నా ప్రసాద

నవనీతంగా భ్రమింపజేసే మమకారాన్ని, ఇంద్రియ లోలత్వాన్ని తస్కరించిన నిరుపమాన చోరుడు శ్రీకృష్ణ పరమాత్మ. అహంకారమును అణిచివేసి, గోపకాంతల భక్త శిఖామణుల హృదయములను క్షాళనం చేసి, నిత్య జాగరూకుడైన జారునిగా వినుతికెక్కాడు. భగవన్నామములు కూడా అష్టోత్తరము, అష్టోత్తర శత సహస్రము. అష్టవర్ణములు యశోదమ్మతల్లిని, గోపకాంతలను, గోపాలకులను మురిపించి, భవబంధములను మరిపించిన మురళీమోహనుడు. మూడునెలల పసికందు పూతనను ముప్పతిప్పలు పెట్టి, సంహరించిన చిన్నారి. ఆ ఏడు సంవత్సరాలలో శకటాసుర సంహారము, తృణావర్త సంహారము, కాళీయమర్ధనము మొదలైన ఎన్నో మహత్తర కార్యాలను చేసి, మధురకు మరలివచ్చి, లోక కంటకుడైన కంసుని సంహరించిన విశ్వవిజేత.

జనన మరణాదులనే సుడిగుండం నుండి విముక్తిని కలిగించేది అష్టాక్షరీ మహామంత్రము. అలాగే శ్రీకృష్ణుని జననీజనకుల పేర్లు కలిపితే అష్టాక్షరీయే. 'దేవకీ వసుదేవులు'. అలా కృష్ణ ప్రియులు, కృష్ణ భక్తులు యావన్మందికి అష్టకష్టములను తొలగించి, అష్టైశ్వర్యములను ప్రసాదించే చిన్నారి కన్నయ్య కృష్ణపక్షంలో వచ్చే అష్టమిని శ్రీకృష్ణాష్టమిగా నిర్ణయించుకున్నాడు. కృష్ణ శబ్దంలో కృష్ అంటే ఆనందమనే అర్థం వుంది. ప్రేమావతారమైన శ్రీకృష్ణావతారము ఆపదలను తొలగించి, ఆనందాన్ని ప్రసాదిస్తుంది. కృష్ణ భగవానుని ఆశ్రయించి, అనుసరించవలసినదేగాని, అనుకరించలేరు. అందుచేతనే కృష్ణుడు చెప్పినట్లు చేయవలసినదేగాని, చేసినట్లు చేయాలని ప్రయత్నిస్తే పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లే అన్న సామెత జ్ఞాపకం వస్తుంది.

రాధామాధవుడు గోకులం నుండి మధురకు రాగానే సాందీపని వద్ద విద్యాభ్యాసం చేశాడు. సాందీపని జన్మజన్మల సుకృతం వలన కృష్ణపరమాత్మని శిష్యునిగా పొందే మహద్భాగ్యం కలిగింది. గురు ఋణం ఎలా తీర్చుకోవాలో విద్యార్థులందరికీ నేర్పిన ఆదర్శ శిష్యుడు. గురుమూర్తికి పుత్ర వియోగం రహితం చేసి, విగతజీవుడైన గురుపుత్రునికి ప్రాణదానం చేసి, గురుదేవునికి అద్భుతమైన,

అసమానమైన కానుకనిచ్చాడు.

కామితార్థ ప్రదాతయైన కృష్ణభగవానుడు గురుకులంలో విద్యాభ్యాసం చేసేటప్పుడు మైత్రీభావానికి మకుటాయమానమైన వుదాహరణంగా వెలుగొందాడు. అది కుచేలుని విషయంలో నిరూపించాడు. లక్ష్మీపతిగా సంపదలన్నిటికీ సర్వాధికారి, సరసిజనేత్రుడైన కృష్ణభగవానుడు నిరుపేదయైన కుచేలుని తన అక్కున చేర్చుకుని, సుసంపన్నుడిగా మార్చాడు. మైత్రీ బంధమునకు మహత్తరమైన నిదర్శనంగా, మానవాళికి మానసచోరునిగా నిరూపించిన నీలమేఘశ్యాముడైన కృష్ణపరమాత్మ మాతృమూర్తిపై ప్రేమకు మమతకు మహత్తర నిదర్శనం. యశోదమ్మను మురిపించి, మైమరపించి, తన చిలిపిచేష్టలతో మహిమలతో ఆమె యశస్సును ద్విగుణీకృతం చేశాడు మువ్వగోపాలుడు. మాతృమూర్తి తనపై చూపిన మధుర భక్తికి పరవశుడైన రాధామాధవుడు వారి మధుర ప్రేమలో పరవశుడై ప్రేమావతారంగా నిరూపించుకున్నాడు.

- సశేషం

## భక్తులకు విన్నపము

శ్రీగురుదేవుల అనుగ్రహం వలన భక్తులు పొందిన అనుభవాలను గ్రంథస్థం చేసే ఉద్దేశ్యంతో తమ తమ అనుభవాలను వ్రాసి పంపమని విజ్ఞాపన చేసియున్నాము.

శ్రీగురుదేవుల స్వస్వరూప లయం తరువాత, శ్రీగురుమాత ద్వారా మనకు అనేకవిధాల రక్షణ జరుగుతోంది. అనేక లీలలను వారు చూపిస్తున్నారు. అనేక దివ్యానుభవాలు భక్తులకు కలుగుతున్నాయి.

భక్తులు పొందిన అట్టిఅనుభవాలను భక్తులందరూ పంచుకొనే సంకల్పంతో తలపెట్టిన “శ్రీసద్గురునాధుని దివ్య చరిత్ర – 3” గ్రంథం పేరు మార్చి **“శ్రీ గురు కృప”** అని పేరు నిర్ణయించటం జరిగింది.

అందరూ ఈ మార్పును గమనించి తమ తమ అనుభవాలను సమగ్రంగా వ్రాసి సత్వరంగా పంపమని ప్రార్థిస్తున్నాము.

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

ఒకడు పెద్ద కారులో స్పీడుగా వెడతాడు. ఇంకొకడు సైకిల్ మీద నెమ్మదిగా వెడతాడు. మరొకడు నడచి నెమ్మదిగా వెడతాడు. ఎవరు ఎలా వెళ్ళినా, భక్తి కలిగి వుండి, పట్టుదలతో ప్రయత్నం చేస్తే, తప్పక వారి గమ్యం చేర గలుగుతారు. తాబేలు, కుందేలు కథలో అతి నెమ్మదిగా వెళ్ళే తాబేలు తన గమ్యం చేరలేదా? కూర్మదాసు అనే భక్తుడు పుట్టుకతోనే కాళ్ళు చేతులు లేనివాడు. చిన్నప్పుడే భక్తి అలవడింది. ఆషాఢ శుద్ధ ఏకాదశికి భక్తులందరూ సంకీర్తన చేసుకుంటూ పండరీపురం చేరుకుంటారు. కూర్మదాసు వారిని వేడుకుంటాడు. కానీ ఎవరూ సాహసించి ఆతనిని తీసుకు వెళ్ళరు. చివరకి తానే భగవన్నామం చేసుకుంటూ నేలమీద దేకుతూ బయలుదేరతాడు. కానీ ఆ రోజుకు చేరలేకపోతాడు. కొంత దూరమే వెళ్ళగలుగుతాడు. అతి కష్టం మీద, నిస్పృహ చెందకుండా పట్టుదలతో ప్రయాణం మొదలుపెట్టాడు. అతని ఆవేదన, భక్తికి సంతోషించి పాండురంగడు అతను ఎక్కడిదాకా చేరగలిగాడో అక్కడనే దర్శనమిస్తాడు. అతనికి దారిలో అన్నపానాదులకు కూడా ఏలోటు లేకుండా చూశాడు రంగడు.

శ్రీమాతాజీ భగవంతుడు నమ్ముకున్నవారికి ఎన్నడూ లోటు చేయడు అని చెబుతూ ఒకసారి శ్రీగురుదేవులు 'నీ బ్రతుకు ఏమిటి? ఏం చేస్తావు?' అన్నారు. అప్పుడు నేను 'నాకు లోటేమిటి? మీరు వున్నారు కదా?' అన్నాను. 'ఒక వేళ నీ అంతట నీవు బ్రతకవలసి వస్తే ఏం చేస్తావు?' అన్నారు. ఆనాటి మాట నాకు ఇప్పటికీ గుర్తుకు వస్తూ వుంటుంది. ముందు ముందు ఎన్నో ఇబ్బందులు, పరీక్షలు ఎదుర్కోవలసి వస్తుంది అని హెచ్చరించినట్లుగా ముందే నాకు సూచించారా అనిపిస్తుంది. 'చక్కగా భగవన్నామం చేసుకో. భగవత్తత్వాన్ని చెప్పుకో. నీకు ఏ లోటూ రాదు. మామూలు తల్లిదండ్రులే తమ బిడ్డలను ఏ లోటు లేకుండా పైకి తీసుకురావాలి అని వుంటుందే. అటువంటిది భగవంతుడు నీకు లోటు చేస్తాడా?' అన్నారు నన్ను శ్రీగురుదేవులు.

-సశేషం

# శ్రీ కాశీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**ఫిబ్రవరి 2021**

2 మంగళ - పుష్య బహుళ పంచమి - శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన.

6 శని - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

10 బుధ - మాస శివరాత్రి.

11 గురు - అమావాస్య.

16 మంగళ - వసంత పంచమి. సరస్వతీ పూజ.

19 శుక్ర - రథసప్తమి

23 మంగళ - భీష్మ ఏకాదశి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ.

27 శని - మాఘపూర్ణిమ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

**మార్చి 2021**

8 సోమ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

11గురు - మహాశివరాత్రి - తె.జా 3-30ని॥ శ్రీబాబుకు బృందావనంలో నమకచమక సహిత రుద్రాభిషేకము; 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, 8గం. శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో సామూహిక ఏకాదశ రుద్రాభిషేకములు; మధ్యాహ్నం 12గం. సహస్రఘటాభిషేకము; లక్ష బిళ్వార్చన; తీర్థప్రసాద వితరణ; భక్తసమారాధన. రాత్రి 7గం.లకు శ్రీ ఉమామహేశ్వరస్వామివారి సామూహిక కళ్యాణ మహోత్సవం; అనంతరం స్వామివారి నగరోత్సవం.

13 శని - అమావాస్య

16 మంగళ - ఫాల్గుణ శుద్ధ తదియ - శ్రీ లలితానంద సరస్వతీస్వామిని వారి ఆరాధన, సత్సంగం.

28 ఆది - పౌర్ణమి - హోళీ - శ్రీసద్గురుపాదపూజ.

# గోమాత

ఒక రోజు పశువధ శాలలో ఒక కసాయి గోవును చంపడానికి వచ్చాడు. అప్పుడు గోవు వాడిని చూసి నవ్వింది. కసాయి 'నేను నిన్ను ఇప్పుడు చంపడానికి వచ్చాను. అది తెలిసి కూడా నువ్వు ఎందుకు నవ్వుతున్నావు?' అని అడిగాడు.

అప్పుడా గోవు 'నేను ఎప్పుడూ మాంసం తినలేదు. అయినా నా చావు ఇంత ఘోరంగా వుండ బోతున్నది. ఏ తప్పు చేయక, ఎవరికి ఏ హానీ కలిగించని నన్ను, నువ్వు చంపి, నా మాంసాన్ని తినే నీ చావు మరి ఇంకెంత ఘోరంగా వుంటుందో అని ఆలోచించి నేను నవ్వాను. పాలిచ్చి మిమ్మల్ని పెంచాను. ఇప్పుడు మీ పిల్లలకూ పాలిస్తున్నాను. కానీ, నేను తినేది మాత్రం గడ్డి.

నా పాలతో మీరు వెన్న చేసుకున్నారు. వెన్నతో నెయ్యి చేసుకున్నారు. నా పేడతో పిడకలు చేసుకుని వంటకు వాడుకున్నారు. అలాగే పేడతో ఎరువులు తయారు చేసి మీ పంటలు పండించుకున్నారు. ఆ డబ్బుతో సుఖంగా జీవిస్తున్నారు. కానీ, నాకు మాత్రం కుళ్ళిపోయిన కూరగాయలు, ఎండిన గడ్డిని పెట్టారు. నా పేడతో గోబర్ గ్యాస్ కూడా తయారు చేసుకుని మీ ఇంటిని చీకటి నుండి వెలుగులోకి తెచ్చుకున్నారు. కానీ నన్ను కసాయివై చంపడానికి వచ్చావు! నా పాల నుండి వచ్చిన శక్తితోనే నన్ను చంపడానికి ఆయుధాన్ని ఎత్తగలిగావు!

ఆ ఆయుధాన్ని ఎత్తే శక్తి నీకు నా నుండే వచ్చింది. నా వల్ల బాగా సంపాదించి ఇల్లు కట్టుకున్నావు. కానీ నన్ను మాత్రం ఒక గుడిసెలోనే వుంచావు. నిన్ను కన్నతల్లి కంటే ఎక్కువగా నీకు ఆసరాగా నిలిచాను. శ్రీకృష్ణునికి ఇష్టురాలిని నేను. నాకు ఇంత పెద్ద శిక్ష వేస్తున్న నీ గతి ఏమౌతుందో! నా సంతతిని, నా జాతిని మీరు ఇలా చంపుతూ పోతూ వుంటే మీకు, మీ ముందు తరాలవారికి మేము సేవ చేసుకునే భాగ్యం వుండదేమో! మాకే భవిష్యత్తులో ఉనికి లేనప్పుడు ఇహ మీకెక్కడి మనుగడ! అని మీ భవిష్యత్తు గురించి ఆలోచించి నిన్ను చూసి నవ్వాను' అని సమాధానం చెప్పింది.

# షడ్గుణాలు

సేకరణ - కె. శ్యామ్

మన లోపల ఒకడున్నాడు. అసలైనవాడు. కానీ వాడి దగ్గరకి వెళ్ళాలి అంటే ఆరు మంది దొంగలు అడ్డుగా వున్నారు. కామ, క్రోధ, లోభ, మోహ. మద, మాత్సర్యాలనే ఆరుగురు దొంగలు. ఈ ఆరుగురిలో నలుగురు దొంగలు నుండి సులభంగా తప్పించుకోవచ్చు. కానీ, ఆ ఇద్దరు దొంగల నుండి తప్పించుకోవడం చాలా కష్టం. ఆ ఇద్దరూ పెద్ద రౌడీలు. వాళ్ళే కామం, క్రోధం. ఈ ఇద్దరు రౌడీలు ఎక్కడ దాక్కొని వుంటారు అంటే రజోగుణం అనే ఇంట్లో. **కామ ఏష క్రోధ ఏష రజో గుణ సముద్భవః** - ఈ కామం, క్రోధం అనేవి రజోగుణం నుండి వస్తున్నాయి అని గీతలో శ్రీకృష్ణుడు చెబుతాడు. కాబట్టి రజో గుణం అనే ఇంటికి తాళం వేయాలి. అంతే. ఇంక వాళ్ళు బయటకి రాలేరు. అయితే ఈ రజోగుణం అనేది ఫస్ట్ ఫ్లోర్. ఇంకా మనం ఫస్ట్ ఫ్లోర్‌కు రాలేదు. మనం గ్రౌండ్ ఫ్లోర్‌లోనే వున్నాం.

మనలో వుండే తమో గుణమే ఆ గ్రౌండ్ ఫ్లోర్. అంటే మనం తమో గుణంలో వున్నాము. ఇంకా గ్రౌండ్ ఫ్లోర్ లోనే వున్నాము. ఇక్కడి నుండి పైకి రావాలంటే చాలా కష్టం. అలాంటిది ఈ గ్రౌండ్ ఫ్లోర్ నుండి పైకి వచ్చి, ఫస్ట్ ఫ్లోర్‌కు వెళ్ళి అక్కడ వుండే ఆరుగురు దొంగల నుండి తప్పించుకుని ఇంకా పైకి వెడితే అప్పుడు సెకండ్ ఫ్లోర్ వస్తుంది.

ఆ ఫ్లోర్ పేరు సత్వ గుణం. ఈ ఫ్లోర్ చాలా పెద్దగా వుంటుంది. హాయిగా వుంటుంది. ఎక్కడ చూసినా వెలుగే వుంటుంది. అయితే చిన్న సమస్య.... ఇక్కడ ఒకే దొంగ వుంటాడు. భయపడకండి. వాడు మంచి దొంగ. వాడు మీకు మంచి మాటలే చెబుతూ వుంటాడు. మీకు థర్డ్ ఫ్లోర్‌కు దారి చూపిస్తాడు. ఆ ఫ్లోర్ పేరు శుద్ధ సాత్వికం. ఇదే చివరిది. ఇక్కడే మీరు అఖండమైన వెలుగులో కలిసిపోయేది. ఆ అఖండమైన వెలుగే పరమాత్మ. అది వెలుగులకు వెలుగు, మహా వెలుగు చివరిగా ఒక శుభవార్త ఏమిటంటే మనం గ్రౌండ్ ఫ్లోర్ నుండి థర్డ్ ఫ్లోర్ వరకు వెళ్ళడానికి ఒక లిఫ్ట్ వుంది. ఆ లిఫ్ట్ పేరే భగవద్గీత. గీతను చదువుతూ వుంటే తమో గుణం నుండి రజో గుణానికి, రజో గుణం నుండి సత్వ గుణానికి, సత్వ గుణం నుండి శుద్ధ సత్వం వరకు మనం ప్రయాణం చేసి, చివరికి శాశ్వతమైన స్థానాన్ని చేరుకోవచ్చు. పునర్జన్మ లేకుండా చేసుకోవచ్చు.

# ధర్మో రక్షతి రక్షితః సేకరణ - సి.హెచ్. ప్రసాద్

ఒక ఊళ్ళో యజ్ఞం జరుగుతోంది. ఆ యజమానికి యజ్ఞకుండంలో బంగారం ముద్ద దొరికింది. ఆయన ఆశ్చర్యపోయాడు! అప్పుడు ఆయన భార్య 'నిన్న పొరపాటున యజ్ఞకుండంలో తాంబూలాన్ని ఉమ్మేశాను. అదే ఈ రోజు బంగారం ముద్ద అయింది' అని చెప్పింది. ఆ ఇంటి యజమాని తానూ పరీక్షించేటందుకు యజ్ఞకుండంలో వుమ్మివేశాడు. మరుసటి రోజు మరో బంగారం ముద్ద దొరికింది.

ఈ వార్త ఆనోట ఈనోట ఊరంతా పాకింది. అంతే! యజ్ఞాలు చేసే బ్రాహ్మణులంతా యజ్ఞకుండంలో ఉమ్ములు వేశారు. బంగారు ముద్దలు పొందారు. ఒక్క అర్కసోమయాజి శర్మ తప్ప.

ఆయన భార్యకు ఇది నచ్చలేదు. 'మనమూ ఉమ్ములు వేద్దాము. బంగారం ముద్దలు పొందుదాము' అని భర్తకు ఎంతగానో నచ్చచెప్పింది. అర్కసోమయాజి ససేమిరా అన్నాడు. చివరకు ఆమె కోపంతో పుట్టింటికి పయనం అయింది. ఆమెకు నచ్చచెబుతూ సోమయాజి కూడా ఆమె వెనుకే బయలుదేరాడు. అలా ఊరి పొలిమేర దాటారో లేదో ...... వాళ్ళ ఊళ్ళో పెద్దగా గొడవలు మొదలయ్యాయి! బంగారం ముద్దల పేరిట కొట్టుకోవడం ప్రారంభించారు! ఇళ్ళు కాలిపోతున్నాయి! మనుష్యులు చచ్చిపోతున్నారు! మొత్తం ఊరు ఊరంతా బూడిదైపోయింది! ఒక్కరూ మిగల్లేదు. ఒక్క అర్కసోమయాజి శర్మ, ఆయన భార్య తప్ప!

అప్పుడే కలిపురుషుడు వారికి ఎదురు వచ్చాడు. 'ఇన్నాళ్ళూ నువ్వు వున్నావనే ఈ ఊరిని వదిలివేశా. ఊరు ఊరంతా బంగారం ముద్దల కోసం ధర్మం తప్పినా, నువ్వూ, నీ కుటుంబం మాత్రమే ధర్మాన్ని పాటించింది. అందుకే నువ్వు ఊళ్ళో ఉన్నంత సేపూ, నేను ఈ ఊరిని ముట్టుకోలేదు. నువ్వు ఊరు వదిలి బయటకు రాగానే, నా పని నేను చేసి, ధర్మహీనులను ధ్వంసం చేశాను" అన్నాడు కలిపురుషుడు.

ధర్మం తప్పనివాడు ఎప్పుడూ విజేతే! ధర్మం ఆచరించేవారికి చిన్న చిన్న ఇబ్బందులు ఎదురైనప్పుడు వారిని చూసి కొందరు మూర్ఖులు నవ్వుతూ హేళన చేస్తూ రాక్షసానందాన్ని పొందుతారు. కానీ, చివరకు ధర్మమే గెలుస్తుంది! ధర్మో రక్షతి రక్షితః

# శ్రీ నృసింహ యోగీంద్రులు

(గత సంచిక తరువాయి)

- మురళి

శ్రీ అవధూత మాట్లాడుతూ 'నాయనా! నీవు ఎప్పుడు వచ్చావో, ఎందుకు వచ్చావో నాకు తెలుసు. నీ సంకల్పబలం ఎలా వుందో తెలుసుకుందామని అడిగాను' అన్నారు. తరువాత నృసింహమూర్తికి అక్కడ లభించే వాటిల్లో ఏది తినవచ్చో, ఏది తినకూడదో, ఏవి ఏ రుచుల్లో వుంటాయో మొదలైనవన్నీ తెలియజేశారు. తరువాత అక్కడి వాతావరణానికి తట్టుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పి, ముఖ్యమైన యోగ ప్రక్రియలు నేర్పించారు. నృసింహమూర్తి యోగసాధన చేస్తూ వుండగా, అవధూత స్వామి తమ యోగ నిష్ఠలో తాము వుండేవారు. ఒక్కొక్కసారి వారం రోజుల వరకూ సమాధి స్థితి నుండి బయటకు వచ్చేవారు కాదు. నృసింహమూర్తి సాధన ఎలా జరుగుతోందో తెలుసుకుని తగు సూచనలనిచ్చేవారు. ఆ ప్రదేశానికి చుట్టుప్రక్కల వున్న మహాత్ముల గురించి, వారు వుండే ప్రదేశాల గురించి తెలియజెప్పేవారు. శీతాకాలం ప్రవేశిస్తుండగా, నృసింహమూర్తిని అక్కడ వాతావరణానికి తట్టుకోలేవు, హరిద్వార్ వెళ్ళి అక్కడే సాధన చేసుకోమని, బదరీలో ఆలయం తెరిచే సమయానికి తిరిగి రమ్మనమని చెప్పారు.

నృసింహమూర్తి గురువుల ఆజ్ఞానుసారం వారి ఆశీస్సులు తీసుకుని హరిద్వార్ చేరుకున్నారు. తిరిగి వచ్చిన నృసింహమూర్తిని చూసి మార్వాడీ దంపతులు మిక్కిలి సంతోషించి, అంతకాలం ఎక్కడ వున్నది, ఏమి నేర్చుకున్నది అన్నీ అడిగి తెలుసుకుని పరమానందపడ్డారు. పిల్లవాడు చిక్కి శల్యమైపోయాడంటూ మంచి ఆహారం పెట్టి ప్రేమతో చూసుకున్నారు. నృసింహమూర్తికి శాస్త్రాలు, వేదాలు, సంస్కృతం నేర్పించడానికి ఉపాధ్యాయులను నియమించి విద్యాభ్యాసానికి తోడ్పడ్డారు. వేసవి ప్రవేశించడంతో మార్వాడీ దంపతుల దగ్గర శెలవు తీసుకుని తిరిగి హిమాలయాలకు ప్రయాణం అయ్యారు.

చలికాలం వెళ్ళగానే తిరిగి వచ్చిన నృసింహమూర్తిని చూసిన శ్రీ సర్వానందావధూతలు మిక్కిలి సంతోషించి దగ్గరకు తీసుకున్నారు. నృసింహమూర్తికి ధ్యానంలో మెళకువలు, ధ్యానం చేసే పద్ధతులను బోధించి, ధ్యానం చేయవలసినదిగా చెప్పారు. నృసింహమూర్తికి ధ్యానంలో

కలిగిన సంశయాలను తెలియజేస్తూ, నిత్యము సమాధిస్థితిలో వుండే సాధకులకు శరీరాన్ని పోషించే ఆహారం అవసరం వుండదని, ప్రాణములను నిలిపే బాధ్యత భగవానుడే వహిస్తాడని తెలియజెప్పారు. ఈ విధంగా ధ్యాన ప్రక్రియలను తెలుసుకుని సాధన చేస్తుండగానే ఆరు నెలలు గడిచిపోయి మళ్ళీ చలికాలం ప్రవేశించింది. ఈసారి కూడా అవధూతస్వామి ఆదేశంతో నృసింహమూర్తి హరిద్వార్ ప్రయాణం అయ్యారు.

శీతాకాలం పూర్తి అయ్యేసరికి తిరిగి అవధూత స్వామిని చేరుకున్న నృసింహమూర్తి, శ్రీ అవధూతస్వామి అనుగ్రహంతో మరలా ధ్యాన ప్రక్రియ మొదలు పెట్టారు. కొద్ది రోజుల తరువాత ఒక రోజున నృసింహమూర్తికి విపరీతమైన జ్వరం వచ్చి, ప్రాణాంతకమైన బాధను అనుభవించి స్పృహ కోల్పోయారు. అప్పుడు ఇద్దరు నల్లని వ్యక్తులు తనను పాశంతో కట్టి తీసుకు వెళ్ళడానికి ఉద్యుక్తులయ్యారు. అంతలో గురుదేవులు శ్రీ అవధూతస్వామి ప్రత్యక్షమై వారిని నివారించి పంపించి వేశారు. మరి కొంతసేపటికి స్పృహ వచ్చి చూసేసరికి, శ్రీగురుదేవులు తన తలను ఆయన ఒడిలో పెట్టుకుని కూర్చుని, 'నాయనా! నీకేమీ భయం లేదు. నేను వున్నాను గదా! నిన్ను రక్షించు కోవడానికి, స్వస్థత చెంది నెమ్మదిగా లే' అంటున్నారు.

నృసింహమూర్తికి కొంతసేపటికి గాని తనకేమి జరిగిందో అర్థం కాలేదు. తరువాత స్వామి పాదాలపై వాలిపోయి, 'స్వామీ! తమరే నన్ను యమ భటుల నుండి కాపాడారు. నా జీవితం ధన్యమైనది. తమ కృపా కటాక్షం నాపై ఇంతగా వున్నదని నేను ఊహించ లేదు. ధన్యోస్మి స్వామీ! తమ ఋణం ఏలా తీర్చుకోగలను?' అంటూ వెక్కి వెక్కి ఏడ్చాడు. అవధూత స్వామి దగ్గరకు తీసుకుని, 'నాయనా! నీకు ఇంకా సంచిత కర్మ రాహిత్యం అవలేదు. ఇప్పుడే మరణిస్తే మరలా జన్మకు రావాలి కదా! అయినా, నీ వలన ఎంతో మంది ఉద్ధరింపబడవలసి వున్నది. ఇంతటి స్వచ్ఛమైన, అమాయకమైన శిష్యుణ్ణి నేను ఎలా పోగొట్టుకుంటాను?' అని చెప్పి స్వామి కొన్ని పండ్లు తెచ్చి స్వయంగా తినిపించారు. మరునాటికి జ్వరం తగ్గి మామూలు మనిషి అయ్యాడు. అప్పటి నుండి అవధూత స్వామితోపాటుగా నృసింహమూర్తి కూడా ధ్యాన సమాధిలోకి వెళ్ళడం జరుగుతోంది.

- సశేషం

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## శ్రీహరిరావు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

13/14-1-1961: శ్రీ బాబు సంక్రాంతి పండుగకు భీమవరం తాతయ్యు గారింట్లో ఉన్నారు.

31-1-1961: గుంటూరులో శ్రీ బాబు మాఘపూర్ణిమ పూజకు పాండుగారింటికి వచ్చారు. గుంటూరులో పూర్ణిమ సమావేశాలు జరగటం యిదే మొదలు. శ్రీ బాబు - శ్రీహరిగారు, శేషగిరిగారు, విశ్వనాధంగారు, సూర్యప్రకాశరావు గారు ( బందా తాతయ్యగారు) - యీ నలుగురిని కలిపి 'హరిగిరివిశ్వప్రకాశం' అని పిలిచే వారు.



బందా తాతయ్యగారు, శ్రీహరిగారు (వృద్ధ పండితులు) ఒకప్పుడు ఎవరినో చూసి తాము కూడా ఏకాదశి ఉపవాసాలు మొదలు పెట్టారు. ఒక ఏకాదశినాడు వాళ్ళు శ్రీబాబు దర్శనం కోసం పోతునూరు వెళ్ళారు. శ్రీ బాబు రాఘవరావుగారి భార్య సీతారామమ్మగారితో "అమ్మా! సద్బ్రాహ్మణులు వచ్చారు. మా ముగ్గురికి వడ్డించమ్మా!" అన్నారు. "భగవంతునితో కలిసి ఉండటం కన్న వుపవాసానికి సార్థకత ఏముంటుంది? అలా కాక, ఊరికే అన్నం తినటం మాత్రం మానుకుని చేసే ఉపవాసం వ్యర్థమే గదా!" అని గ్రహించి వాళ్ళిద్దరూ ఏకాదశి ఉపవాసానికి స్వస్తి పలికారు.

1-2-1962 : గుండుగొలను వాస్తవ్యులైన కొండ ఈశ్వరరాజుగారు అష్టగ్రహ కూటమి సందర్భంగా నామ సప్తాహ యజ్ఞం నిర్వహించారు. శ్రీ బాబు ఆశీస్సులతో ఆ యజ్ఞం మహదానందకరంగా జరిగింది. ఆ సందర్భంగా శ్రీ బాబును స్తుతిస్తూ కవిగారు వ్రాసిన పద్యం -

**సీ॥ కాబోలు॥ బదరికా కాననంబున తపం॥ బాచరించిన ఘనుండాది మౌని॥**
**కాబోలు॥ మారుతిం గడుబ్రహ్మవేత్తగా॥ సలిపిన నాటి కౌసల్య కొడుకు॥**
**కాబోలు॥ కదన రంగమున కవ్వడికి గీతాబోధ చేసిన ధర్మ మూర్తి**

కాబోలు। నితడు లోకములనెల్ల నహింస। మొలకలెత్తించిన బుద్ధమూర్తి।

తే.గీ గుండుగొలను గ్రామమునందు కొండ వారి
యీశ్వరుండు నోచిన నోములెల్ల పండి
నామ సప్తాహ యజ్ఞమున్ నడుపునిదె ప్ర
సాదు డద్వైత సామ్రాజ్య చక్రవర్తి॥

20-12-1962: శ్రీ బాబు పూర్ణిమ పూజ సందర్భంగా గుంటూరు వెళ్ళి నాలుగురోజులు ఉన్నారు. ఒక రోజు భక్తులందరితోను అమరావతి వెళ్ళారు. అక్కడ అందరితోను శ్రీబాబు కృష్ణ స్నానాలు చేశారు. ఆ రసవత్తర ఘట్టాన్ని గురించి గురువుగారు సుశీలకు ఉత్తరం వ్రాశారు.

ప్రత్యేకంగా పడవలో భక్తులందరితో శ్రీ బాబు కృష్ణ అవతలి ఒడ్డుకు వెళ్ళి అక్కడ స్నానాలు చేశారు. దంపతులకు బ్రహ్మ ముళ్ళు వేయించారు. గురువుగారిని సంకల్పం చెప్పమని తామూ చేతులు జోడించుకుని నిలబడ్డారు. గురువుగారు కాస్త సందేహించారు. (వెనుక ఒకప్పుడు గోదావరి స్నానాలకి ఆమె శ్రీబాబుకు చెప్పకుండా, శ్రీహరిగారి పిల్లలు రాధను సుశీలను మరికొందరిని తీసుకుని వెడితే, అందరూ మునిగి పోవటం, శ్రీ బాబు దయవలన రక్షణ జరగటం గుర్తుకు వచ్చింది కాబోలు!)

శ్రీ బాబు ఎత్తిపొడుపుగా "ఏమిటి అంత దూరంగా నుంచున్నావు? గోదావరినే జయించిన దిట్టవు. నీకేం భయం? మళ్ళీ ముంచటానికి రాధ, సుశీల లేరని ఆలోచిస్తున్నావా? మేమంతా వున్నాము గదా, నీతో సంకల్పం చెప్పించుకుని మునగటానికి?" అని ఆమెను కాసేపు ఉడికించి, తరువాత సంకల్పం అందరికీ చెప్పించారు. జుట్టంతా తడిసి ముంగురులన్నీ ముఖాన పడుతుంటే చిరునవ్వులు చిందిస్తూ, నడుం లోతు నీటిలో నుంచున్న ఆ ముగ్ధ మనోహర రూపం చూడటానికి రెండు కళ్ళూ చాలలేదని, ఆ లీలా మానుష మూర్తితో ఆడుకుంటూ, పాడుకుంటూ, ఆరాధించుకుంటూ ఎన్ని గంటలు స్నానము చేశామో! అని గురువుగారు వ్రాశారు.

-సశేషం

(గత సంచిక తరువాయి) విష్ణు  కథలు -రమణ ప్రసాద్

# అవధూత పిచ్చమ్మ

పిన్నమనేని వెంకమ్మకు అమ్మకు సేవ చెయ్యాలని అనిపించింది. అమ్మకు ఆహారం పెట్టేది. అమ్మకూడా అర్థరాత్రి వెంకమ్మ దగ్గరకు వచ్చేది. అమ్మలో యోగాగ్ని రగిలేదో ఏమో, వెంకమ్మ ఏడెనిమిది కాగుల నీరు ధారాపాతంగా అమ్మమీద పోసేది. అమ్మకు తపన తగ్గేది.

అమ్మ మహిమలు అక్కడివారిని ఆకర్షించాయి. అమ్మకు దేవీ దృష్టి తగిలినప్పుడు కాలనాగులు పడగ విప్పి ఆడుతూ ఉండటం చూసి జనాలు పారిపోయేవారు. ఎప్పటికో కన్ను తెరిచేది. ఆకలికి ఆకో, అలమో, కాలవలోని ఒండ్రో, శ్మశానంలోని బూడిదో తినేది. ఆమెకు జన సాంగత్యం గిట్టేది కాదు. మనుష్యులు కనపడితే దూరాలకు పారిపోయేది.



గొడ్లను మేపే పిల్లలు పిచ్చిదని రాళ్ళు వేసేవారు. అమ్మ ప్రేమతో సహించేది. ఒక్కోసారి ఆగ్రహం వచ్చేది. ఒక పిల్లవాడితో “ఒరేయ్! రాళ్ళు విసరకు రా! చేతులు బొబ్బలెక్కుతాయి” అంది. వాడు రాయి వెయ్యనే వేశాడు. వాడి చేతులు బొబ్బలెక్కాయి. కుర్రాడి తల్లి దండ్రులు అమ్మదగ్గరికి వచ్చి వేడుకున్నారు. “పోతాయి పోరా!” అంది. అలాగే పోయాయి.

“ఒకసారి తపస్సు చేస్తుండగా నాకు దశావతారాలు దర్శన మయ్యాయి. కృష్ణుడు సాక్షాత్కరించాడు. ఇవి నిజమైన దర్శనాలు కావనిపించింది. మాయ కృష్ణుణ్ణి చూసి, “ ‘ఒరే! చిత్తకళ్ళోడా! నువ్వు నిజంగా దేవుడవైతే నా మనస్సులో ఆరాటం అణగదే! శాంతి రాదే!’ అని తిరస్కరించాను. ఇలా దర్శనాలను తోసేస్తూ నిజమైన దేవుడి కోసం ఆరాటపడుతున్నాను.

ఒకసారి సమస్త జగత్తూ శూన్యమయింది.అదొక మహాశూన్యం. ఆ మహాశూన్యం

అంతాఒక మహాజ్యోతి రూపమై భూమ్యాకాశాలు నిండి దర్శనమైంది. మహదానందం, గొప్ప శాంతి లభించాయి.

అమ్మ అందరితో మాట్లాడుతున్నా, ఒక అలౌకికానందంలో తేలుతున్నట్లు కనబడేది.అమ్మ మాట ఆశీర్వాదంగా జరుగుతోంది.

అమ్మకు సేవ చేసేవారిలో శ్రీపిన్నమనేని నాగయ్య ముఖ్యుడు. అమ్మకు ఫలహారాలు తన స్వహస్తంతో తినిపించేవాడు. శ్రీబుచ్చయ్య, శ్రీ అన్నపూర్ణమ్మ, శ్రీమంగమ్మ మొదలైన భక్తులు 1925లో అమ్మకు ఆశ్రమం కట్టారు.

అమ్మ రోజు విడిచి రోజు సమాధిలోకి వెళ్ళేది. ఆమె మహిమ జగమంతా వ్యాపించింది. ఆర్తులు, జిజ్ఞాసువులు, భక్తులు అమ్మను దర్శించి ఆధ్యాత్మికోన్నతిని పొందారు.

అనేకమంది ఇహలోక ఇబ్బందులను ఆమెతో చెప్పుకునేవారు. అమ్మ "నీకు మేలు జరుగుతుంది పో" అని అంటే మేలు జరిగిందన్నమాటే. రామబాణం అయినా గురి తప్పుతుందేమో గాని అమ్మమాట గురి తప్పదు.

ఈ మహిమకు తాను కర్తను కాదు అనేది " ఒరేయ్! వీళ్ళు ఆ బాధ, ఈ బాధ అనివచ్చి పడ్డారు. నా పని అయిపోయింది రా" అంటూ ఒకరికి "నీ పని అవదు రా" అంటే వీడికి పక్షపాతం అనుకుంటారు. నిజం చెప్పాలంటే వీడికేమి తెలుసు రా పని అయ్యేది లేనిది. రాముడు ఎలా అనిపిస్తే అలా అంటాడు వీడు అంతే."

ఒక్కోసారి "ఒరేయ్! వీడు పొట్టకూటి వైద్యుడు కాడు రా వీడు తపస్సు చేసింది మీ రోగాలు పోగొట్టటానికి కాదు రా ! ఎవరి కర్మ వాడు అనుభవించాలిరా! ధర్మం చేసుకొండి పొండి!" అనేది.

మరోసారి ప్రేమగా "వీడివల్ల మీకు మేలు జరగాలంటే సమాధినుండి లేవగానే రా రా! వీడు అన్న మాటలన్నీ యదార్థంగా జరుగుతున్నాయి అని అనుకుంటున్నారు రా! అప్పుడు రా!" అనేది.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD